RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY — తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 245 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | గురువారం, మార్చి,26, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 245 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Thursday, March,26, 2026 | PAGES : 8 RS : 4 /- |


## మళ్లీ కట్టెల పొయ్యి..!




**భద్రాద్రి,తెలంగాణ దిశ :**గ్యాస్ కొరతతో గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు ఇబ్బ ందులు పడుతున్నారు. గృహావసరా లకు గ్యాస్ కొరత లేదని అధికార యంత్రాంగం ప్రకటిస్తున్నా వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. గ్యాస్ సిలిండర్ బుక్ చేస్తే డెలివరీకి కనీసం పదిరోజుల సమయం పడుతోంది. గ్యాస్ సిలిండర్ తీసుకున్న 45 రోజుల తర్వాతనే గ్యాస్ తిరిగి బుక్ చేసుకోవాలని నిబంధనలు విధించా రు. ఈలోగా గ్యాస్ అయిపోతే కట్టెల పొయ్యి వెలిగించాల్సిందే. వాణిజ్య అవసరాల కోసం వినియోగించే గ్యాస్ సిలిండర్లకు మరింత కొరత ఏర్పడింది. కమర్షియల్ సిలిండర్లు దొరకకపోవటంతో కొన్ని హోటళ్లను మూసేశారు. కొందరు కట్టెల పొయ్యిలతో తంటాలు పడుతున్నారు.

**వేధిస్తున్న కొరత:** గ్యాస్ కొరతతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ముందస్తు అవసరాల కోసం గ్యాస్‌ను బుక్ చేసుకునేందుకు తొందరపడుతున్నారు.

### పేరంట్స్ కోసం...

## 15 శాతం జీతాలు

### రేవంత్ సంచలన నిర్ణయం



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** కన్నవారిని కంటికి రెప్పలా చూసుకోవాల్సిన బాధ్య తను మరిచి, వారిని రోడ్డున పడేస్తున్న కొందరు ప్రభుత్వ ఉద్యోగుల తీరుపై తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఒక సంచలనం అని చెప్పాలి. పదవి, హోదా ఉన్నా.. కన్నతల్లిదండ్రులకు పట్టెడు అన్నం పెట్టని వారికి ఈ కొత్త చట్టం ఒక గట్టి గుణపాఠం కానుంది. మమకారం కరువైన చోట కనీసం ఆర్థిక భరోసానైనా కల్పించాలన్న ప్రభుత్వ సంకల్పం వేలాది మంది వృద్ధులకు కొండంత అండగా నిలవబోతోంది. ఈ చట్టం వెనుక ఉన్న నిబంధనలు, అది అమలులోకి వచ్చే తీరుపైలోటుగా విశ్లేషణచేస్తే.. తల్లిదం డ్రులకోసం జీతంలో కోత తమతల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వఉద్యోగు లపై కఠిన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. సదరు ఉద్యోగి జీతంలో 15శాతం లేదా గరిష్టంగా 10,000 వరకు కోత విధించి, ఆ మొత్తాన్ని నేరుగా వారి తల్లిదండ్రుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. దీనివల్ల వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లల దయా దాక్షిణ్యాలపై ఆధారపడకుండా, గౌరవంగా బతికే అవకాశం లభిస్తుంది.

### పట్టణాల్లో ఇందిరమ్మ

## ఇళ్లు

### అసెంబ్లీలో మంత్రి పొంగులేటి కీలక ప్రకటన



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** రాష్ట్రంలోఅర్హులైన పేదల కోసం నిర్మించి ఇస్తున్న ఇందిరమ్మ ఇళ్లపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు. మార్చి 31 నాటికి లక్షా 12 వేల ఇళ్లు పూర్తవుస్తున్నాయని, వివిధ నిర్మాణ దశల్లో ఉన్న మరో లక్ష ఇందిరమ్మ ఇళ్లు జూన్ నెల వచ్చేసరికి పూర్తి కాబో తున్నాయని తెలిపారు. ఏప్రిల్ చివరి వారం లేదా మే నెల నుంచి రెండోవిడత ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులు చేపడుతామని మంత్రి ప్రకటించారు. గతంలో సగం నిర్మించి వదిలేసిన గృహలక్ష్మి ఇళ్లకు కూడా నిధులు ఇస్తామని స్పష్టం చేశారు. ఇల్లు కట్టినదాన్ని బట్టి ఆర్థిక సహాయం ఇవ్వాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని గుర్తుచేశారు. ఇక పట్టణాల్లో ఇందిరమ్మ ఇళ్లనిర్మాణంపై కూడా పొంగులేటి కీలక ప్రకటన చేశారు. త్వరలోనే పట్టణాల్లోనూ ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామన్నారు. గ్రేటర్ పరిధిలో బస్తీలకు దగ్గర్లోనే ఇళ్ల నిర్మాణాలు చేపడుతామన్నారు. నగరాలకు దూరంగా ఇళ్లు ఇస్తుంటే.. లబ్దిదారులు వెళ్లడం లేదన్నారు. వారికి అందుబాటులోనే ఇళ్లను నిర్మించి ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలిపారు.



### రాష్ట్రంలో పెట్రోల్

## కొరత లేదు

- డీలర్లు స్వయంగా ప్రకటన చేశారు
- కొందరు కావాలనే పుకార్ల వ్యాప్తి
- కేంద్రమంతరి బండి సంజయ్ వెల్లడి

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ కొరత ఉందంటూ సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు నమ్మొద్దని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజ య్ కుమార్ రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయిల్ సంస్థల వద్ద సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయంటూ.. తెలంగాణ పెట్రోలి యం డీలర్స్ అసోసియేషన్ పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. పెట్రోలు, డీజిల్ కొరత రాకుండా ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలని కొన్ని శక్తులు కుట్ర చేస్తున్నాయని, ఆ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వాహనదారులు రోజువారీ అవసరాల మేరకు.. పెట్రోలు, డీజిల్‌ను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఉదయం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో వస్తున్న పుకార్లపై ఆయన స్పందిస్తూ.. 'అమెరికా, ఇజ్రాయిల్ ? ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా పెట్రోలు, డీజిల్ కొరత ఏర్పడిందంటూ సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న ప్రచారంలో ఏ మాత్రం నిజం లేదు. ఇండియన్ ఆయిల్, హెచ్ పీసీఎల్, బీపీసీఎల్ వంటి అన్ని పబ్లిక్ సెక్టార్ ఆయిల్ కంపెనీల వద్ద అవసరమైనంత స్టాక్ అందుబాటులో ఉంది. పెట్రోలు, డీజిల్ సరఫరా లోనూ లోపం లేదు.




### ఢిల్లీలోని పార్టీ ఆఫీసు ఖాళీ చేయాలంటూ కాంగ్రెస్ కు

## కేంద్రం నోటీసులు

ఢిల్లీ: దాదాపు ఐదు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి చిరునామాగా ఉన్న ఢిల్లీలోని అక్బర్ రోడ్ కార్యాలయంపై కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ శనివారం (మార్చి 28)లోగా ఆ భవనాన్ని ఖాళీ చేయాలని స్పష్టం చేసింది. 1978 నుంచి అంటే గత 48 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యకలాపాలకు 24, అక్బర్ రోడ్ భవనం కేంద్రంగా ఉంది. ఈ కార్యాలయంతో పాటు, 5 రైసినా రోడ్‌లో ఉన్న ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆఫీస్‌ను కూడా ఖాళీ చేయాలని నోటీసుల్లో పేర్కొన్నారు. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే ఢిల్లీలోని కోట్లా మార్గ్‌లో 'ఇందిరా భవన్' పేరుతో కొత్త జాతీయ కార్యాలయాన్ని నిర్మించుకుంది. గత ఏడాదే సోనియా గాంధీ దీనిని ప్రారంభించారు.




### అమెరికా ఒక 'ఉగ్రవాద'

## దేశం

### కిమ్ జోంగ్ ఉన్ సంచలన వ్యాఖ్యలు

డిల్లీ: ఉత్తర కొరియా సుప్రీం లీడర్ కిమ్ జోంగ్ ఉన్ మరోసారి అమెరికాపై నిప్పులు చెరిగారు. పార్లమెంట్ సమావేశంలో ప్రసంగించిన ఆయన, అమెరికాను ఒక ఉగ్రవాద రాజ్యంగా అభివర్ణించారు. ప్రపంచవ్యాప్తంగా శాంతికి విఘాతం కలిగిస్తున్నది అమెరికా సైనిక విధానాలేనని ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో కిమ్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.




### మీరేమైనా రాజులా..

## ఆ చిన్నారిని స్టేషన్‌కు రప్పిస్తారా?

### అత్యాచార కేసులో సుప్రీం ఆగ్రహం

ఢిల్లీ: నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచార ఘటనలో సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఏమాత్రం సున్నితత్వం లేకుండా బాలిక, ఆమె తల్లిదండ్రుల తో వ్యవహరించారని గురుగ్రామ్ పోలీసులపై మండిపడింది. క్రాస్ ఎగ్జామినేషన్ చేసిన తీరును తప్పుప డుతూ.. ఇది అత్యంత దారుణమైన ప్రవర్తన అని, వారిని అగౌరవించ డమేనని మందలించింది. ఈ లైంగిక దాడి కేసులో పోలీసుల స్పందన సరిగా లేదని ఆరోపిస్తూ బాధితురాలి తల్లిదండ్రులు అత్యున్నత న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు. వారి పిటీష న్‌పై బుధవారం మరోసారి విచారణ జరిగింది. "దర్యాప్తులో భాగంగా ఆ చిన్నారి వద్దకు వెళ్లకుండా తననే పోలీ సు స్టేషన్‌కు రప్పించడం సిగ్గుచేటు. మీరు బాధితురాలి ఇంటికి ఎందుకు వెళ్లలేదు. మీరేమైనా రాజులా..?" అని సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. అలాగే ఈ నేరాన్ని పోక్సో చట్టంలోని సెక్షన్ 6 నుంచి సెక్షన్ 10కి ఎందుకు మార్చారని అడిగింది.



### ఇరాన్‌తో యుద్ధానికి తెరపడే

## సమయం

### 15 సూత్రాల శాంతి ప్రణాళికను పంపిన అమెరికా

వాషింగ్టన్: ఇరాన్‌తో నెల రోజులుగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా కీలక ముందడుగు వేసింది. యుద్ధాన్ని నిలిపివేసి, అణు కార్యక్రమాన్ని పూర్తిగా రద్దు చేసేందుకు 15 సూత్రాలతో కూడిన ఒక విస్తృత ప్రణాళికను ఇరాన్‌కు పంపింది. మరోవైపు, ఒక ఒప్పందం కుదుర్చుకోవడా నికి ఇరాన్ సిద్ధంగా ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరిం చుకుంది. వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం..

# పాలకుల వివక్షకు వ్యతిరేకంగా కదం తొక్కిన కలం కార్మికులు

**- ఐఅండ్ పీఆర్ కమీషనరేట్ ముట్టడి**
**- టీడబ్ల్యూజెఫ్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య**



**హైదరాబాద్, మార్చి 25, (తెలంగాణ దిశ)** :జర్నలిస్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబభిస్తున్న నిర్లక్ష్యవైఖరి, వివక్ష ధోరణికి నిరసనగా అనేక మంది జర్నలిస్టులు బుధవారం హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ(ఐ అండ్ పీఆర్) కమీషనర్ కార్యాలయం(సమాచార భవన్) ముట్టడించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజెఫ్) ఇచ్చిన రాష్ట్రవ్యాప్త జర్నలిస్టుల"ఛలో హైదరాబాద్" కార్యక్రమం పిలుపు మేరకు వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన జర్నలిస్టులు ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐఅండ్ పీఆర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శన జరిపారు. అనంతరం జర్నలిస్టులు ప్రధాన ప్రవేశ ద్వారం ముందు బైఠాయించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వివక్షకు వ్యతిరేకంగా జర్నలిస్టులు చేసిన నినాదాలతో సమాచార భవన్ దద్దరిల్లింది. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు,రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లుగా జర్నలిస్టుల పట్ల వివక్ష చూపుతుందని, జర్నలిస్టుల సమస్యలను విస్మరించిందని విమర్శించారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో జర్నలిస్టుల సంక్షేమం ఊసే లేదని, కనీసం జర్నలిస్టుల సంక్షేమం గురించి ఒక్క మాట కూడా చెప్పకుండా, నిధులు కేటాయించకుండా దారుణమైన అన్యాయం చేసిందని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా జర్నలిస్టులకు కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వలేదని, హెల్త్ కార్డులు సైతంఇవ్వలేకపోయిందని ఆయన దుయ్యబట్టారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల ఊసే లేదని, సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపి ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా తప్పుకుంటుందని ఆరోపించారు. పదవీవిరమణ పొందిన పాత్రికేయులకు అనేక రాష్ట్రాలలో పెన్షన్ ఇస్తుండగా, మన రాష్ట్రంలో ఏ ఒక్కరికీ పెన్షన్ ఇవ్వడంలేదని అన్నారు. చిన్న, మధ్య తరహా పత్రికలు, పీరియాడికల్స్ ను పూర్తిగా అణిచివేస్తున్నదని, గత రెండేళ్లుగా అడ్వర్టైజ్ మెంట్ బిల్స్ చెల్లించలేదని ధ్వజమెత్తారు. ఆర్ ఎన్ ఐ, పీఆర్ జిఐ రిజిస్ట్రేషన్ తో నడుస్తున్న అనేక చిన్న, మధ్య తరహా పత్రికలను ఎంపానల్మెంట్ చేయడం లేదని, కనీసం ఆ పత్రికలకు అక్రెడిటేషన్ కార్డులు కూడా ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఎన్నికల్లో జర్నలిస్టులకిచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా మోసం చేశారని మామిడి సోమయ్య ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఇదే విధంగా జర్నలిస్టుల సంక్షేమానికి ఎటువంటి చర్యలు తీసుకోకుండా వివక్ష చూపుతూ, నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తే రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో



జర్నలిస్టుల చైతన్య యాత్రతో ప్రజల్లోకి వెళతామని మామిడి సోమయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడు జర్నలిస్టులను విస్మరించే ప్రభుత్వాలకు పుట్టగతులుఉండవని అన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర కో- కన్వీనర్లు బండి విజయకుమార్, వల్లాల జగన్, తన్నీరు శ్రీనివాస్, కుడితాడు బాపూరావు, నేషనల్ కౌన్సిల్ సభ్యులు జగదీశ్వర్, ఎర్రమిల్లి రామారావు, రాష్ట్ర నాయకులు కె. పాండురంగారావు, పొట్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మహమ్మద్ రఫీ, పద్మనాభరావు, ఉమామహేశ్వరరావు, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవి, కో- కన్వీనర్లు ఆర్. శ్రీనివాస్ గౌడ్, సంతోష్, బ్రహ్మం,మహిళా నాయకులు సాజిదా, మంజులారెడ్డి, శివపార్వతి, సుస్మిత, తీగవరపు శాంతి, వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఐఅండ్ పిఆర్ డైరెక్టర్ కిషోర్ బాబు కు అందజేశారు.

## జమ్మిగడ్డలో నేడు ఉచిత వైద్య శిబిరం



ఏఎస్ రావునగర్, మార్చి 25, (తెలంగాణ దిశ) :ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని జమ్మిగడ్డలోని ప్రభుత్వ హాస్పిటల్ (కుషాయిగూడ పీహెచ్ సీ)లో గురువారం ఉచిత ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహిం చనున్నట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమాదేవి తెలిపారు. ఈ శిబిరం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు కొనసాగు తుంది. ఈ శిబిరంలో ప్రభుత్వ స్పెషలిస్ట్ వైద్యులు వివిధ విభాగాల్లో సేవలు అందించనున్నారు. గైనకాలజిస్ట్ (మహిళల వైద్య నిపుణులు), ఆర్థోపెడిక్ (ఎముకలు, కీళ్ల సమస్యలు), జనరల్ మెడిసిన్, పెడియాట్రిషన్ (పిల్లల వైద్య నిపుణులు), డెంటల్ (పళ్ల వైద్య నిపుణులు), ఆఫ్తాల్మాలజిస్ట్ (కంటి వైద్య నిపుణులు) వంటి విభాగాల్లో పరీక్షలు, సలహాలు ఇవ్వబడతాయి.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కుషాయిగూడ పీహెచ్ సీకు విచ్చేసి వైద్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ రమాదేవి విజ్ఞప్తి చేశారు.



ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కొల్లు సురేష్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి 'శ్రీ శ్రీనివాస కళ్యాణం' చిత్రాన్ని పిపీ. నల్లూరి శివరామకృష్ణ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు కనకమేడల రాంబాబు, పి. నాగేశ్వరరావు, ఉప్పల సుకుమార్ తదితరులు జ్ఞాపికగా అందించి శుభాకాంక్షలు తెలిపారు.
(ఉప్పల్, తెలంగాణ దిశ)

# అమరుల స్ఫూర్తితో ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి పోరాడుదాం





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 25, (తెలంగాణ దిశ)** :ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు), ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) జిల్లా కమిటీల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన "స్ఫూర్తి యాత్ర" భద్రాచలం గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం ఘనంగా ముగిసింది. ముగింపు సభలో పిడిఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల స్ఫూర్తితో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌ను సవరించి కనీసం 20 శాతం నిధులను విద్యారంగానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న సంక్షేమ వసతి గృహాల డైట్ బిల్లులను విడుదల చేయాలని, రూ. 8500 కోట్ల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులతో పాటు ఎంఈఓ, డీఈఓ పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. భగత్ సింగ్ గొప్ప అధ్యయనశీలి అని, ఆయన రచనలు యువతకు మార్గదర్శకాలని పేర్కొన్నారు. తెలంగాణ విద్యాశాఖ కమిషన్ సిఫారసులను పునః పరిశీలించాలని, విద్యాసంస్థల్లో మతోన్మాద భావజాలాన్ని ప్రతి ఘటించాలని పిలుపు నిచ్చారు. చరిత్ర పుస్తకాల్లో వక్రీకరణలు, అశాస్త్రీయ అంశాలను చేర్చే విధానాలను వ్యతిరేకించాలని అన్నారు. అంతర్జాతీయ అంశాలపై కూడా స్పందిస్తూ, అమెరికా యుద్ధోన్మాద విధానాలను వ్యతిరేకించాలని, భారత్-అమెరికా చమురు వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరారు. చమురు, గ్యాస్ సంక్షోభానికి కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బుర్ర వీరభద్రం, మునిగల శివ ప్రశాంత్, జిల్లా కమిటీ సభ్యులు శ్రావణి, అఖిల్, రామ్ చరణ్, నాయకురాలు వనజ తదితరులు పాల్గొన్నారు.

# సుభాష్ నగర్ బస్తీ బాటలో గుర్తించిన సమస్యలను పరిష్కరిస్తా

**- కాంగ్రెస్ నేత నెమిలి అనిల్ కుమార్**



**ఉప్పల్, మార్చి 25, (తెలంగాణ దిశ)** :శక్తి సాయి నగర్ డివిజన్ పరిధిలోని సుభాష్ నగర్ లో బుధవారం కాంగ్రెస్ పార్టీ నేత నెమలి అనిల్ కుమార్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా నాచారం సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ కుమార్‌తో కలిసి ప్రాంతంలోని రోడ్ల దుస్థితిని పరిశీలించారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటిని తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తున్నానని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన లక్ష్యమన్నారు. సుభాష్ నగర్ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి, కోయలకొండ రాజేష్, అన్వర్ తదితరులు, స్థానికులు పాల్గొన్నారు.



# పాఠశాలలో కుప్పకూలిన బాలుడు... చికిత్స పొందుతూ మృతి

**- తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు**



కుషాయిగూడ, మార్చి 25, (తెలంగాణ దిశ) :కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలుడు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..., కాప్రా ఆదర్శనగర్‌కు చెందిన బ్రహ్మదండి జ్యోతి తన కుమారుడు సూరజ్ కుమార్ (14), వాసవి శివనగర్‌లోని గోపీ మెమోరియల్ హైస్కూల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతున్నాడని తెలిపారు. ఈ నెల 6న ఉదయం పాఠశాల ప్రాంగణంలో సూరజ్ కుమార్ ఆకస్మాత్తుగా కుప్పకూలిపోవడంతో, పాఠశాల యాజమాన్యం కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. అనంతరం కుటుంబ సభ్యులు అతడిని స్థానిక కొరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మెడికోవర్ ఆసుపత్రికి మార్చారు. అదే రోజు రాత్రి మెదడుకు శస్త్రచికిత్స నిర్వహించారు. తదుపరి రోజు గాంధీ ఆసుపత్రికి తరలించారు. మార్చి 8 తెల్లవారుజామున విద్యార్థి మృతి చెందాడు. డాక్టర్లు తెలిపిన ప్రకారం మెదడులో రక్తం గడ్డకట్టడం వల్లే మరణం సంభవించినట్లు పేర్కొన్నారు. అదే రోజు కుషాయిగూడలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. అయితే తన కుమారుడి మరణంపై అనుమానం వ్యక్తం చేస్తూ తల్లి జ్యోతి కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఎఫ్ఆర్ఐ నం.239/2026 కింద బిఎన్ఎస్ 106(1) సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని కోరుతూ రాస్తారోకో



**ఏఎస్ రావునగర్, మార్చి 25, (తెలంగాణ దిశ)** :పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఏఎస్ రావునగర్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులు రాధిక చౌరస్తాలో రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ రావునగర్ శాఖ కార్యదర్శి అభిషేక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకపోవడం వల్ల పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆరోపించారు. అలాగే, ప్రస్తుత బడ్జెట్‌లో విద్యారంగానికి తగిన నిధులు కేటాయించలేదని విమర్శించారు. విద్యారంగ అభివృద్ధి కోసం కనీసం 15 శాతం నిధులను కేటాయించేలా ప్రభుత్వం వెంటనే బడ్జెట్‌ను సవరించాలని ఆయన డిమాండ్ చేశారు. రాస్తారోకో కారణంగా కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. అనంతరం పోలీసులు నిరసనకారులను అరెస్టు చేసి కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో నగర సంయుక్త కార్యదర్శి మోహిత్ యాదవ్‌తో పాటు సంజయ్, అజయ్, సంతోష్, శ్రీశాంత్, శ్రీకాంత్ తదితర నగర కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎన్ పిఆర్ డికి రూ.10 వేల ఆర్థిక సహాయం

**కాప్రా, మార్చి 25, (తెలంగాణ దిశ) :** వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్ పిఆర్ డి) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8) సందర్భంగా మహిళా వికలాంగుల సంక్షేమం, సాధికారిత కోసం మార్చి 25, 26 తేదీలలో ఎస్‌వీకేలో రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం నిర్వహణకు ఆర్థిక సహాయం చేయాలని కాప్రా కాంగ్రెస్ సీనియర్ నాయకులు తన్నీరు శ్రీహరి గారిని కోరగా, ఆయన స్పందించి రూ. 10 వేలను ఎన్ పిఆర్ డి రాష్ట్ర అధ్యక్షుడు కె. వెంకట్‌కు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమానికి ఎల్లప్పుడూ తనవంతు సహాయం అందిస్తానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ కాంగ్రెస్ నాయకులు జి. సత్యనారాయణ, ఎన్ పిఆర్ డి జిల్లా ఉపాధ్యక్షులు జి. బాలయ్య, కమిటీ సభ్యులు రాజారావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీరామ నవమి ఉత్సవాలను భక్తి భావంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి

**కుషాయిగూడ, మార్చి 25, (.తెలంగాణ దిశ) :** రాబోయే శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కుషాయిగూడ పోలీస్ ఇన్ స్పెక్టర్ ఎల్. భాస్కర్ రెడ్డి అధ్యక్షత వహించారు. పీఎస్ పరిధిలోని వివిధ ఆలయ కమిటీలు, ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతలు, శబ్ద కాలుష్య నియంత్రణ, అలాగే ప్రజల సౌకర్యాలపై ఇన్ స్పెక్టర్ పలు సూచనలు చేశారు. ఉత్సవాలను భక్తి భావంతో, ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు



జరగకుండా నిర్వహించాలని నిర్వాహకులకు స్పష్టంగా ఆదేశించారు. ప్రజల సహకారం అత్యంత ముఖ్యమని, పోలీస్ శాఖతో సమన్వయం పాటిస్తూ ఉత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సబ్ ఇన్ స్పెక్టర్లు సుధాకర్ రెడ్డి, వెంకన్న, సాయిలు, సతీష్ తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అసెంబ్లీలో చర్లపల్లి ఐజీ కాలనీ సమస్యల ప్రస్తావన

**- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**కాప్రా, మార్చి 25, (తెలంగాణ దిశ) :** చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఐజీ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న పలు మౌలిక సమస్యలను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించారు. 2009లో సీఎం వైఎస్. రాజశేఖర రెడ్డి పాలనలో నిర్మించిన ఇందిరా గృహకల్ప కాలనీలో ప్రస్తుతం తీవ్ర సమస్యలు నెలకొన్నాయని ఆయన పేర్కొన్నారు. కాలనీలోని ఇళ్లలో పైకప్పుల లీకేజీలు, స్లాబ్ పగుళ్లు, డ్రైనేజ్ సమస్యలు వంటి ఇబ్బందులు రోజురోజుకీ పెరుగుతున్నాయని తెలిపారు. సంబంధిత ఎంఎంసీ, ఆర్ అండ్ బి, వాటర్ వర్క్స్ శాఖలకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 5,000 మంది నివాసితులు ఈ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ, వెంటనే తగిన



చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అదనంగా, కాలనీ పరిసరాల్లో ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి రక్షించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు.


# సంపాదకీయం

## ఏఐతో భవిష్యత్తు..

నలభై ఆరేళ్ల క్రితం అంటే 1980లో దేశంలో కంప్యూటరీకరణను విస్తరింప చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా ఆందోళనలు తలెత్తాయి. 1984 సంవత్సరాన్ని 'యాంటీ కంప్యూటరైజేషన్ సంవత్సరం'గా పరిగణించారు. దీంతో తమ ఉద్యోగాలు పోతాయని, ఆర్థికంగా దెబ్బతింటాయని, దేశంలో తీవ్ర పరిస్థితులు తలెత్తుతాయని కార్మికులు నిరసన ప్రదర్శనలు సాగించారు. అయితే రానురాను డిజిటల్ టెక్నాలజీని అమలు లోకి విస్తారంగా తీసుకు రావడంతో సమాజంలోని అన్ని వర్గాల్లో, దేశం మొత్తం మీద ఆలోచనల్లో మార్పు రావడం ప్రారంభమైంది. కంప్యూటర్లు, ఆధునిక సాంకేతికత భారీగా ఉద్యోగాలు కల్పిస్తాయని, జీవితంలో అనేక విధాలుగా ఉపయోగపడతాయని నమ్మకం పెరిగింది. ఎఐ (కృత్రిమ మేధ) ఆధునిక ప్రపంచంలో కీలకమైన కేంద్రంగా వర్ధిల్లుతోంది. ఇప్పుడు ఎక్కడ విన్నా ఎఐ గురించే చర్చ వినిపిస్తోంది. మానవ చరిత్రలో ఇప్పటివరకు ఎన్నో పెద్దమార్పులు వచ్చాయి. కానీ ఇప్పుడు ఎఐ అన్నది అత్యంత శక్తివంతమైన, అతి గొప్ప ఆవిష్కరణల్లో ఒకటిగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ సాంకేతిక నాయకత్వంలో భారత్ అగ్రస్థానం సాధించాలన్న లక్ష్యంతో ఢిల్లీలోని భారత్ మండపంలో 'ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్' ప్రారంభం కావడం చెప్పుకోదగిన ఘట్టం. ఎఐ యుగం నియమాలు, ప్రమాణాలు, అవకాశాలను రూపొందించడంలో మనదేశం కీలకంగా ఉండాలనే ప్రధాన లక్ష్యంతో ఏర్పాటైన ఈ సదస్సు గురించి ప్రధాని మోడీ ఆశాభావం వ్యక్తం చేశారు. డిజిటల్ సదుపాయాల కల్పన, శక్తివంతమైన స్టార్టప్‌ల ఏర్పాటు, అత్యాధునిక పరిశోధనలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో భారత్ బాధ్యత మరింత పెరగనుందని వెల్లడించడం గమనార్హం. ఇప్పటికే దేశంలో ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, పరిపాలన, వంటి అనేక రంగాల్లో ఎఐ కీలక పాత్ర పోషిస్తోంది. ఇప్పుడు 22 రంగాల్లోని 17 రంగాల కంపెనీలు తమను తాము ఎఐ సాంతికత దిశగా మార్చుకోవలసిన ఒత్తిడి ఎక్కువగా ఉంది. ఎఐతో ఎక్కువ అనుబంధం ఉన్న ఐటి వంటి రంగాల్లో పెద్ద మార్పులు వస్తున్నాయి. మైక్రోసాఫ్ట్ ఎఐ సిఇఒ ముస్తఫా సులేమాన్ వచ్చే 18 నెలల్లో కంప్యూటర్ ఉద్యోగాలన్నీ ఎఐతో భర్తీ అవుతాయని అంచనా వేశారు. ఎఐ వల్ల 2035 నాటికి ప్రపంచ జిడిపి (స్థూల దేశీయోత్పత్తి) లో 15 శాతం పాయింట్లు పెరగవచ్చని ఏడాది క్రితం ప్రైస్ వాటర్ హౌస్ కూపర్స్ అనే సంస్థ అంచనా వేసింది. అంటే ప్రతి సంవత్సరం సుమారు 1 శాతం అదనపు అభివృద్ధి తథ్యమన్న అంచనాలు వెలువడ్డాయి. ఈ సదస్సు ఒక బలీయమైన జాతీయ ఎఐ పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి మాత్రమే ప్రయత్నించకుండా ప్రపంచ దక్షిణార్థ దేశాలను కూడా ఇందులో భాగస్వాములను చేయాలన్న తపన కనిపిస్తోంది. ఆయా దేశాలు కృత్రిమ మేధపై తమ ప్రణాళికలను ఈ వేదికపై వెల్లడించే అవకాశం కనిపిస్తోంది. అయితే ఎఐ ప్రణాళికలకు సంబంధించి భారత్ ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. ఈ సాంకేతికతకు కావలసిన కనీస సెమీ కండక్టర్లు లేదా కంప్యూటర్ చిప్‌లు తయారు చేసే సామర్థ్యం ఇంకా భారత్‌కు అలవడ లేదు. ప్రస్తుతం దేశంలో ఎఐ సంపూర్ణ సామర్థ్యంతో ఏ కంపెనీ లేదు. అలాగే మెగా డేటా సెంటర్లు లేవు. పాత్రధారులు, నాటకం స్క్రిప్టు, కనీసం వేదిక లేకుండా ఏదైనా నాటకం ఎలా ప్రదర్శించలేరో అలాగే క్షేత్రస్థాయిలో కనీస మౌలిక అవసరాలులేకుండా ఎఐ సాంకేతికతను సాధించడం కష్టతరమే. అయినప్పటికీ ఎఐకి అనుకూలమైన పర్యావరణ వ్యవస్థ గత కొన్నేళ్లుగా ఏర్పడి చిగుళ్లు మొలకెత్తడం ప్రారంభమైంది. రెండేళ్లుగా సెమీకండక్టర్ల తయారీ అత్యంత నాటకీయంగా ఆవిర్భావమైంది. ఈ ఏడాది జనవరి నాటికి దేశం లోని ఆరు రాష్ట్రాల్లో 10 సెమీ కండక్టర్ తయారీ ప్రాజెక్టులు వచ్చాయని, వీటిలో కొన్ని ఆన్‌లైన్‌లో ఉన్నాయని ప్రభుత్వం అంచనాగా చెబుతోంది. ఇక రెండో అంశం.. దేశంలో మెగా డేటా సెంటర్ల ఏర్పాటును ప్రోత్సహించడం గత ఏడాది గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్, డిజిటల్ కనెక్షన్, తదితర ప్రపంచ స్థాయి సాంకేతిక సంస్థలు 2030 వరకు ఎఐ, క్లౌడ్ మౌలిక సదుపాయాల్లో దాదాపు 68 బిలియన్ డాలర్ల వరకు పెట్టుబడులు పెట్టడానికి నిర్ణయం తీసుకున్నాయి. ఈ మేరకు చిప్ డిజైన్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ పర్యావరణం నెలకొల్పేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే చెప్పవచ్చు. ఈ సమయంలో ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లభిస్తేనే ఊపందుకుంటుంది. ఆయా ప్రపంచ స్థాయి సాంకేతిక సంస్థల అధినేతలు భారతదేశ సామర్థ్యం గురించి ఆశావహులుగా ఉన్నారు. జెన్‌సెన్ హుయాంగ్, గూగుల్ సిఇఒ సుందర్‌పిచాయ్, తదితరులు భావితరానికి ఎఐ సాంకేతిక కేంద్రంగా భారత్ వర్ధిల్లుతుందని, ఎఐని భారత్ ముందుకు తీసుకెళ్తుందని అభిప్రాయాలతో దృఢమైన విశ్వాసం వెలిబుచ్చడం గమనార్హం. భారత్‌లో మానవ వనరులకు లోటు లేదని, ఎఐ అమలు స్థాయి మరింత ముందుకు వెళ్తుందని చెబుతున్నారు. ఇప్పటికే ఎఐ ఫ్రంట్రన్నర్ చాట్ జిపిటిలో ప్రపంచం మొత్తం మీద రెండో భారీ మార్కెట్‌గా భారత్ ఉంటోందని ఆ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సామ్ అల్ట్‌మాన్ అంగీకరించారు. ఎఐ నమ్మదగిన ముఖ్యమైన మార్కెట్‌గా అభివర్ణించారు. ఇవన్నీ ఎఐ సంస్థలకు భారత్ ఆకర్షణీయ కేంద్రంగా మారుస్తున్నాయి. ఏఐ వల్ల పలు ఉద్యోగాలకు పోతాయని ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ప్రముఖ బిలియనీర్, పారిశ్రామిక వేత్త వినోద్ ఖోస్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏఐ టూల్స్ రాబోయే ఐదేళ్లలో ఐటీ సేవలు, బీపీఓ ఉద్యోగాలు దాదాపు కనుమరుగవుతాయని అంచనా వేశారు. రానున్న 15 ఏళ్లలో నైపుణ్య ఆధారిత వృత్తులు తుడిచిపెట్టుకుపోతాయని హెచ్చరించారు. అయితే విద్య, వైద్య సంరక్షణ అందరికీ అందుబాటులో వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 నేపథ్యంలో హిందుస్థాన్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వినోద్ ఖోస్లా మాట్లాడారు. బిపిఓ లేదా బిజినెస్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్ అనేది కంపెనీలు థర్డ్-పార్టీ సర్వీస్ ప్రొవైడర్లకు అవుట్‌సోర్స్ చేసే లార్జ్ సెగ్మెంట్ వర్క్‌ను సూచిస్తుంది. ఏఐ వల్ల ఇది తీవ్రంగా ప్రభావితమవుతుందని తెలిపారు. ఇండియాలోనే ఐటీ సర్వీసెస్‌పై కూడా ఇదే తరహా ప్రభావ ఉంటుందని అంచనా వేశారు. ఏఐ సిస్టమ్స్ ఆర్థికంగా విలువైన పనులలో మానవులను అధిగమించగల స్థితికి వేగంగా చేరుకుంటున్నాయని ఆయన తెలిపారు. ఏఐ అనేది డిజిటల్ అసిస్టెంట్స్ నుండి అటానమస్ ఏఐ వర్కర్స్ దిశగా మారుతుందని, అకౌంటింగ్, లా, మెడిసిన్, చిప్ డిజైన్ వంటి రంగాలు మరో దశాబ్దకాలంలో ఏఐ వల్ల ప్రభావితం కావచ్చని తెలిపారు. ఈ తరుణంలో ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ ఢిల్లీలో ప్రారంభం కావడం శుభోదయమే. ఇది విజయవంతమైతే ఈ శిఖరాగ్ర సమావేశం భారతీయ సంకల్పానికి కేవలం ఒక వేడుకలా మాత్రమే కాకుండా, ప్రపంచానికే కీలకమైన మలుపుగా మారుతుందన్న ఆశ కలుగుతోంది.

# విశ్వసనీయతకు నిలువెత్తు సాక్ష్యం:

## అప్పుల సుడిగుండంలోనూ అన్నదాతకు అభయ మిచ్చిన రేవంత్ రెడ్డి



- పురుషోత్తం నారగౌని
సీనియర్ జర్నలిస్ట్,
సామాజిక విశ్లేషకులు.

తెలంగాణ రాష్ట్ర రాజకీయ చరిత్రలో విశ్వసనీయతకు కొత్త నిర్వచనం లభించింది. అధికారం అంటే అనుభవించడం కాదు, అట్టడుగు వర్గాలకు సేవ చేయడమని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు తన చర్యల ద్వారా నిరూపిస్తున్నారు. నిన్న శాసనసభలో ప్రతిపక్షాల అర్థరహితమైన అరుపులకు, అర్థం లేని విమర్శలకు సమాధానంగా ఆయన తన 'అక్షర సత్యాలను' మరియు 'అమలు చేస్తున్న హామీలను' ప్రజల ముందుంచారు. ముఖ్యంగా తొలి విడత రైతు భరోసా నిధులను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయడం ద్వారా, కేవలం మాటలకే పరిమితం కాకుండా చేతల్లో తన చిత్తశుద్ధిని చాటుకున్నా రు. ఇది కేవలం ఒక నిధుల విడుదల కార్యక్రమం కాదు, ఇది నిన్నటి అసెంబ్లీ సాక్షిగా ప్రతిపక్ష బిఆర్ఎస్ చేసిన విష ప్రచారానికి రేవంత్ రెడ్డి గారు ఇచ్చిన అత్యంత పదునైన సమాధానం. "ఊరుకులాడితే పొద్దుమూ కదు" అన్న సామెత చందాన, గత పాలకుల వలె కాలయాపన చేయకుండా, క్లిష్ట పరిస్థితుల్లోనూ రైతుకు ఇచ్చిన మాటను ఆయన నిలబెట్టుకున్నారు.

గత పదేళ్ల తెలంగాణ పాలనను ఒక్కసారి పరిశీలిస్తే, అహంకారం మరియు అసమర్థత కలగలిసిన పాలన ఏ విధంగా ఉంటుందో స్పష్టమవుతుంది. పదేళ్ల పాటు అధికారాన్ని వెలగబెట్టిన భారస ప్రభుత్వం ప్రజల కష్టాలను, సామాన్యుడి కన్నీళ్లను గాలికి వదిలేసింది. పదేళ్ల కాలం అంటే ఒక దశాబ్దం; ఒక తరాన్ని మార్చేయగలిగే సమయం. అటువంటి సుదీర్ఘ కాలం అధికారంలో ఉండి కూడా, ప్రతిసారీ తెలంగాణను 'పసిగుడ్డు' అని చెప్పుకుంటూ తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడమే గత పాలకులు చేసిన పని. పదేళ్లయినా తెలంగాణ ఇంకా పసిగుడ్డు ఎలా అవుతుంది? అన్న కనీస స్పృహ లేకుండా ప్రజలను మభ్యపెట్టిన తీరును ప్రజలు గమనించారు. ఫలితంగానే, మొన్నటి ఎన్నికల్లో ప్రజలు కారుకు వాతపెట్టి, ఆ పార్టీని అధికారం నుండి సాగనంపారు. ప్రజాగ్రహాన్ని చవిచూసిన వెంటనే బుద్ధి తెచ్చుకోవాల్సింది పోయి, రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంపై మొదటి రోజు నుండే విషం చిమ్మడం భారస నేతల నైజంగా మారింది. తాము సృష్టించిన అప్పుల కుప్పను సరిదిద్దడానికి రేవంత్ రెడ్డి గారు పడుతున్న కష్టాన్ని గుర్తించకపోగా, తామేదో పదేళ్ల పాటు స్వర్ణయుగాన్ని అందించినట్లుగా ప్రతిపక్ష నేతలు ఆడుతున్న డ్రామాలు ప్రజలకు అసహ్యం కలిగిస్తున్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గమనిస్తే, గత ప్రభుత్వం తెలంగాణను ?5.62 లక్షల కోట్ల భారీ అప్పుల ఊబిలోకి నెట్టింది. ప్రతినెలా కేవలం వడ్డీల చెల్లింపులకే ఖజానా నుండి ?21,304 కోట్లు ధారపోయాల్సి వస్తోంది. ఇటువంటి అత్యంత దారుణమైన ఆర్థిక స్థితిలో ప్రభుత్వం బాధ్యతలు చేపట్టింది. ఖజానా ఖాళీగా ఉందని తెలిసినా, ప్రతిపక్షాలు "హామీలు ఏమయ్యాయి?" అంటూ మొదటి రోజే గొంతు చించుకోవడం వారి దివాళాకోరుతనానికి నిదర్శనం. అయితే, రేవంత్ రెడ్డి గారు ఏనాడు సాకులు వెతకలేదు. ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ, అప్పులను పునర్వ్యవస్థీకరించారు.

25,612 కోట్ల అధిక వడ్డీ రుణాలను తక్కువ వడ్డీకి మార్చడం ద్వారా రాష్ట్రానికి ?22,142 కోట్ల నగదు వెసులుబాటు కల్పించారు. ఇటువంటి శాస్త్రీయ ఆర్థిక నిర్వహణ వల్లే, నేడు రైతు భరోసా కోసం ?18,000 కోట్లు కేటాయించడం సాధ్యమైంది. గత ప్రభుత్వం రైతు బంధు పేరుతో పెద్ద భూస్వాములకు, పారిశ్రామికవేత్తలకు మేలు చేస్తే, రేవంత్ రెడ్డి గారు నిజమైన అన్నదాతకు పెట్టుబడి సాయం అందేలా చూస్తున్నారు. సన్నవడ్లకు క్వింటాకు ?500 బోనస్ ఇవ్వడానికి ?3,500 కోట్లు కేటాయించడం ద్వారా రైతు ఆదాయాన్ని పెంచే దిశగా అడుగులు వేశారు.

ప్రజా ప్రభుత్వం తన ఆరు గ్యారెంటీలను అమలు చేయడానికి కట్టుబడి ఉందని బడ్జెట్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సంక్షేమ రంగానికి ఏకంగా50,713 కోట్లు కేటాయించడం సామాన్యమైన విషయం కాదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ?500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు ఇప్పటికే అమలవుతుండగా, కొత్తగా ?4,000 కోట్లతో 1.15 కోట్ల కుటుంబాలకు ?5 లక్షల ఉచిత బీమా (ఇందిరమ్మ ఫ్యామిలీ లైఫ్ ఇన్సూరెన్స్) కల్పించడం రేవంత్ రెడ్డిగారి మానవీయ కోణానికి నిదర్శనం. గత పదేళ్లలో ప్రజల ప్రాణాలకు భద్రత లేని పరిస్థితి నుండి, నేడు ప్రతి పేద కుటుంబానికి ఒక అభయహస్తం లభిస్తోంది. విద్యారంగంలో గత పదేళ్ల విధ్వంసాన్ని సరిదిద్దుతూ 26,674 కోట్లు కేటాయించి, 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నారు. నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్న గత పాలనను అంతం చేస్తూ, రేవంత్ రెడ్డి గారు అధికారం చేపట్టిన అతి తక్కువ కాలంలోనే 67,763 మందికి ప్రభుత్వ నియామక పత్రాలు అందజేశారు. ఇదంతా కళ్లముందే కనిపిస్తున్నా, ప్రతిపక్షం మాత్రం గుడ్డిగా విమర్శలు చేస్తూనే ఉంది. మొన్నటి బడ్జెట్ ప్రసంగం సమయంలో ప్రతిపక్షాల అల్లరి చూస్తుంటే, అధికారం కోల్పోయిన బాధ వారిలో ఎంతగా ఉందో అర్థమవుతోంది. పదేళ్ల పాటు అధికారంలో ఉండి ప్రజలను విస్మరించిన వారు, ఈరోజు రేవంత్ రెడ్డి గారు సాధిస్తున్న విజయాలను చూసి తట్టుకోలేకపోతున్నారు. ముఖ్యమంత్రి గారు తన విదేశీ పర్యటనల ద్వారా లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తుంటే, అవి రాకుండా అడ్డుపడటానికి ప్రయత్నించిన చరిత్ర ఈ ప్రతిపక్ష నేతలది. దావోస్ పర్యటన ద్వారా రాష్ట్రాన్ని గ్లోబల్ స్కిల్ హబ్‌గా మార్చాలనే రేవంత్ రెడ్డి గారి తపనను అవహేళన చేసిన వారు, నేడు స్కిల్ యూనివర్సిటీ స్థాపనతో యువతకు దక్కుతున్న అవకాశాలను చూసి మౌనంగా ఉండిపోయారు. హైదరాబాద్‌ను కేవలం తమ వ్యాపార కేంద్రంగా మార్చుకున్న గతపాలకులకు భిన్నంగా, రేవంత్ రెడ్డి గారు 'భారత్ ఫ్యూచర్ సిటీ' ద్వారా 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి నగరాన్ని నిర్మిస్తున్నారు. మూసీ పునరుజ్జీవనం ద్వారా నగరం యొక్క రూపురేఖలను మార్చడానికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయం.

నిజమైన నాయకుడు అంటే సంక్షోభంలోనే తన సత్తా చాటుతాడు. రేవంత్ రెడ్డి గారు అదే చేస్తున్నారు. ఒకవైపు గత ప్రభుత్వం వదిలి వెళ్లిన అప్పుల భారం రాష్ట్రాన్ని సతమతం చేస్తున్నా, పట్టుదలతో అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను సమతుల్యం చేస్తున్నారు. ?3.24 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌లో సామాన్యుడిపై రూపాయి భారం వేయకుండా నిధులు సమీకరించడం ఆయన ఆర్థిక చాకచక్యానికి నిదర్శనం. రైతు భరోసా నిధులు అందుకున్న ప్రతి రైతు ముఖంలో కనిపిస్తున్న చిరునవ్వు, ప్రతిపక్షాల నోళ్లు మూయించడానికి సరిపోతుంది. ఇచ్చిన మాటను తూచా తప్పకుండా అమలు చేసే రేవంత్ రెడ్డి గారి నైజాన్ని ప్రజలు ఇప్పటికే గుర్తించారు. ఆరు గ్యారెంటీలే కాదు, తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని ఈ ప్రభుత్వం అమలు చేస్తుందనే నమ్మకం నేడు బలంగా ఉంది.


తెలంగాణ నేడు సురక్షితమైన చేతుల్లో ఉంది.

అహంకారపు పాలన నుండి ప్రజా పాలనలోకి రాష్ట్రం ప్రవేశించింది. పదేళ్ల పాటు ప్రజలను గాలికి వదిలేసి, ఇప్పుడు నీతులు చెబుతున్న భారస నాయకులకు ప్రజలే సరైన సమయంలో బుద్ధి చెబుతారు. రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో తెలంగాణ కేవలం అప్పుల నుండి విముక్తి పొందడమే కాకుండా, దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా ఎదగబోతోంది. ఒకవైపు సంక్షేమ విప్లవం, మరోవైపు నైపుణ్యాల వృద్ధి, ఇంకోవైపు మౌలిక వసతుల కల్పన-ఇవన్నీ కలిపి తెలంగాణను ఒక వెలుగు దివ్వెలా నిలబెడతాయి. తనపై విషం గ్రక్కుతున్న వారికి తన పనితీరుతోనే సమాధానం చెబుతున్న రేవంత్ రెడ్డి గారి పయనం తెలంగాణ జాతికి గర్వకారణం. అభివృద్ధి మరియు సంక్షేమానికి పెద్దపీట వేసి, ఆర్థిక క్రమశిక్షణతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్న ఈ ప్రజా ప్రభుత్వం తెలంగాణ భవిష్యత్తుకు ఒక పటిష్టమైన భరోసా. రేవంత్ రెడ్డి గారు అంటే ఒక ఆశ, ఒక ఆశయం, మరియు మాట ఇస్తే తప్పని ఒక నిబద్ధత.

# మండి బిర్యానీ తిని..

## ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి అస్వస్థత

### ఏఎస్ రావునగర్‌లో ఫుడ్ పాయిజనింగ్ కలకలం - ఆలస్యంగా వెలుగుచూసిన వైనం...












**ఏఎస్ రావునగర్, మార్చి 25, (తెలంగాణ దిశ):** కాప్రా సర్కిల్ పరిధిలోని ఏఎస్ రావునగర్‌లో ఫుడ్ పాయిజనింగ్ ఘటన కలకలం రేపింది. స్థానికంగా ఉన్న "డెలీషియస్ మండి" హోటల్‌లో భోజనం చేసిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మూడు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన బాధితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే... స్థానిక నివాసితులు ఉమేష్, రాధిక, నరసింహలతో పాటు నాలుగేళ్ల బాలుడు విహాల్ కలిసి సదరు హోటల్‌లో మండి బిర్యానీ తిన్నారు. ఆహారం తీసుకున్న కొద్ది సేపటికే వారందరికీ వాంతులు, విరోచనాలు ప్రారంభమయ్యాయి. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు వెంటనే జమ్మిగడ్డలోని ఒక ప్రైవేట్ క్లినిక్‌కు తరలించారు. తీవ్ర ఫుడ్ పాయిజనింగ్ కారణంగా వారు గత మూడు రోజులుగా చికిత్స పొందుతున్నారు. చిన్నారి విహాల్ ఆరోగ్యంపై కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాసిరకం ఆహారం వడ్డించడం వల్లే ఈ ఘటన జరిగిందని బాధితులు హోటల్ యాజమాన్యంపై ఆరోపిస్తున్నారు. ఈ సంఘటనపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఆహార భద్రతా అధికారులు తక్షణమే స్పందించి సంబంధిత హోటల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో కూడా ఏఎస్ రావునగర్ ప్రాంతంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొంటూ, అధికారుల పర్యవేక్షణ లోపంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే కాకుండా, హోటళ్లలో ఆహార నాణ్యతపై నిరంతర తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

# జిల్లా కోర్టులో గవర్నమెంట్ ప్లీడర్ ఛాంబర్ ప్రారంభం





కుషాయిగూడ, మార్చి 25, (తెలంగాణ దిశ) : కుషాయిగూడలోని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కోర్టులో గవర్నమెంట్ ప్లీడర్ ఛాంబర్‌ను బుధవారం ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వి. బాల భాస్కర్ రావుతో కలిసి జిల్లా కలెక్టర్ మను చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ జిల్లా జడ్జి గవర్నమెంట్ ప్లీడర్ కె. రాంచందర్ రెడ్డిని అభినందించారు. న్యాయవ్యవస్థలో సేవలందిస్తున్న గవర్నమెంట్ ప్లీడర్లకు సౌకర్యాలు మెరుగుపడేందుకు ఈ ఛాంబర్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెకండ్ అదనపు జిల్లా జడ్జి అమరావతి, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి. కిరణ్ కుమార్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి రవీందర్, ఫస్ట్ జూనియర్ సివిల్ జడ్జి రాజు, సెకండ్ జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంతి, మూడవ జూనియర్ సివిల్ జడ్జి సరళరేఖ, సీనియర్ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బాపిరెడ్డి, జూనియర్ ఏజీపీ సునితా రాజ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, యాక్టింగ్ ప్రెసిడెంట్ సంజయ్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



# బత్తాయి పండ్లను లైట్ తీసుకోకండి..

## ఇవి మనకు చేసే మేలు అంతా ఇంతా కాదు..

బత్తాయి పండ్లు.. చూసేందుకు అచ్చం నారింజ పండ్లలాగే ఉంటాయి. కానీ నారింజ పండ్లంత తియ్యగా ఉండవు. మరీ పుల్లగా కూడా ఉండవు. కానీ ఇవి రుచిగా ఉంటాయి. అనేక పోషకాలను కలిగి ఉంటాయి. చాలా మంది రహదారుల పక్కన ఉండే జ్యూస్ సెంటర్లలో బత్తాయి రసం తాగేందుకు ఆసక్తిని చూపిస్తుంటారు. ఈ పండ్లు కాస్త తీపి, పులుపు రుచి కలిగి ఉంటాయి. చూసేందుకు పెద్ద నిమ్మ పండు సైజులో ఉంటాయి. బత్తాయి పండ్లనే స్వీట్ లైమ్ అని కూడా పిలుస్తారు. ఈ పండ్ల గుజ్జు లేత పసుపు రంగులో ఉంటుంది. బత్తాయి పండ్లను చాలా మంది నేరుగా తింటారు. కానీ ఈ పండ్లను జ్యూస్‌గా తాగితేనే చాలా బాగుంటుంది. బత్తాయి పండ్ల రసాన్ని చాలా మంది ఇష్టంగా తాగుతారు. బత్తాయి పండ్లను తింటున్నా లేదా జ్యూస్‌ను తాగుతున్నా అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

నోటి దుర్వాసనకు చెక్..: బత్తాయి పండ్లలో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. జలుబు, జ్వరం వచ్చినప్పుడు రోజుకు 2 సార్లు ఈ పండ్ల జ్యూస్‌ను తాగాలి. దీంతో త్వరగా కోలుకుంటారు. శరీరానికి శక్తి లభించి ఉత్సాహంగా మారుతారు. శరీరం కోల్పోయిన ద్రవాలు, ఎలక్ట్రోలైట్స్‌ను తిరిగి పొందవచ్చు. నీరసం, అలసట తగ్గుతాయి. చురుగ్గా మారుతారు. బత్తాయి పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది దంతాలు, చిగుళ్లను దృఢంగా, ఆరోగ్యంగా ఉంటుంది. ఈ పండ్లను తింటే నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. దీంతో నోటి దుర్వాసన తగ్గిపోతుంది. బత్తాయి పండ్లను తింటే నోట్లో లాలాజలం అధికంగా స్రవించబడుతుంది. ఇది మనం తిన్న ఆహారాన్ని సులభంగా, త్వరగా జీర్ణం చేస్తుంది. దీంతో అజీర్తి, గ్యాస్, అసిడిటీ వంటి సమస్యల నుంచి బయట పడవచ్చు.

మలబద్దకం ఉండదు..: బత్తాయి పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఈ పండ్లను తింటే మలబద్దకం తగ్గుతుంది. రోజూ ఉదయం సుఖ విరేచనం అవుతుంది. బత్తాయి పండ్లలో ఫ్లేవనాయిడ్స్ ఉంటాయి. ఇవి జీర్ణ రసాలు, ఆమ్లాలు విడుదల అయ్యేందుకు సహాయం చేస్తాయి. దీంతో ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. ఏదైనా వ్యాధి వచ్చిన వారు బత్తాయి పండ్ల రసాన్ని సేవిస్తుంటే త్వరగా శక్తి లభించి రోగం నుంచి త్వరగా కోలుకుంటారు. ఉదయం జాగింగ్ లేదా వాకింగ్, యోగా, వ్యాయామం చేసిన అనంతరం ఒక గ్లాస్ బత్తాయి పండ్ల రసం సేవిస్తే శరీరానికి వెంటనే శక్తి లభిస్తుంది. మళ్లీ ఉత్సాహంగా మారుతారు. రోజంతటికీ కావల్సిన శక్తి లభిస్తుంది. ఎంత పనిచేసినా నీరసం, అలసట రావు. బ్రేక్ ఫాస్ట్‌లో భాగంగా టీ, కాఫీ వంటివి తాగకుండా బత్తాయి పండ్ల రసం తాగితే ఎంతో మంచిదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

విరేచనాల నుంచి ఉపశమనం..: బత్తాయి పండ్లలో ఉండే ఆమ్లాలు జీర్ణాశయం, పేగుల్లో ఉండే వ్యర్థాలు, టాక్సిన్లను బయటకు పంపుతాయి. దీంతో జీర్ణవ్యవస్థ శుభ్రంగా మారుతుంది. లివర్ ఆరోగ్యం మెరుగు పడుతుంది. అజీర్తితో బాధపడేవారికి బత్తాయి రసం ఔషధంగా పనిచేస్తుంది. బత్తాయి పండ్లలో ఉండే పొటాషియం విరేచనాలను తగ్గిస్తుంది. బాధితులు త్వరగా కోలుకునేలా చేస్తుంది. కామెర్లు వచ్చిన వారు ఈ పండ్ల రసం తాగుతుంటే త్వరగా కోలుకుంటారు. వాంతులు, తలతిరగడం వంటి సమస్యలు ఉన్నవారు బత్తాయి పండ్ల రసం తాగితే మంచిది. గొంతు సంబంధ ఇన్‌ఫెక్షన్లు ఉన్నవారు బత్తాయి రసం తాగితే త్వరగా ఉపశమనం లభిస్తుంది. రోజూ ఈ జ్యూస్‌ను సేవించడం వల్ల రక్త నాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. బ్లడ్ క్లాట్స్ కరిగిపోతాయి. దీంతో గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు. ఇలా బత్తాయి పండ్లు మనకు చేసే మేలు అంతా ఇంతా కాదు. కనుక ఇవి కనబడితే విడిచిపెట్టకుండా తెచ్చుకుని తినండి.

# పొట్టను పట్టించుకుందాం



మన శరీరాలకు పోషణ మనం తినే ఆహారం నుంచే లభిస్తుంది. శరీరం బాగుండాలంటే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. దురదృష్టవశాత్తూ ఇప్పుడు చాలామంది జంక్ ఫుడ్, రిఫైన్డ్ పిండి, చక్కెరలు, ఉప్పు, రసాయనాలు, ప్రిజర్వేటివ్‌లు ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకుంటున్నారు. ఇలాంటి ఆహారాలు జీర్ణ సమస్యలతోపాటు ఇతర ఆరోగ్య సమస్యలకు బాటలు వేస్తాయి. అంతేకాదు మసాలా, వేపుడు ఆహారాలు కూడా పొట్టలో అసౌకర్యం కలుగజేస్తాయి. కాబట్టి, పొట్టకు మేలు చేసే ఆహారాన్ని మన భోజనంలో భాగం చేసుకోవాలి.

యోగర్ట్: పొట్ట ఆరోగ్యానికి యోగర్ట్ మంచి ఆహారం. రోజూ యోగర్ట్ తీసుకోవడంవల్ల జీర్ణ సమస్యలనుఅధిగమించవచ్చు. ఉదయం వేళలో, మధ్యాహ్నం భోజన సమయంలో యోగర్ట్ తీసుకోవడం మంచిది.

హోల్ గ్రెయిన్స్: ముతక ధాన్యాలు (హోల్‌గ్రెయిన్స్) పొట్టకు మేలుచేసేవిగా పరిగణిస్తారు. గోధుమలు, ఓట్స్, బియ్యం, ఇతర హోల్‌గ్రేన్స్ నుంచి ఆహారం తీసుకోవాలి. ఇవి పొట్టకు మంచివి. వీటిలో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది.

అరటిపండు: బాగా మాగిన అరటిపండు పొట్టకు ఎంతో మేలుచేస్తుంది. ఇందులో పొటాషియం ఉంటుంది. అరటిపండు తినడం వల్ల అరుగుదల మెరుగుపడుతుంది.

ఎన్నో పొట్ట సమస్యలు కూడా పారిపోతాయి. అరటిపండు తినడం పొట్టకు సంబంధించిన గ్యాస్ట్రో ఇంటెస్టినల్ సమస్యలను తగ్గిస్తుంది. బొప్పడిపండు: బొప్పడిపండు అరుగుదలకు సహాయకారిగా ఉంటుంది. పొట్టను శుభ్రం చేసే పోషకాలకు ఇది గని. అలా బొప్పడిపండు మలబద్ధకాన్ని నివారిస్తుంది. అరుగుదల మొదలుకుని గుండెలో మంట, అజీర్తి తదితర సమస్యలను దూరం చేస్తుంది. అల్లం: అల్లాన్ని పొట్టకు మేలుచేసేదిగా పరిగణిస్తారు. వికారం, కడుపునొప్పితో బాధపడుతున్నవాళ్లకు అల్లం మంచిది. రోజువారీ గా భోజనంలో ఏదో విధంగా అల్లాన్ని చేర్చుకోవడం మంచిది.

# నల్ల జీలకర్రలో అనేక లాభాలు..!



జీలకర్రను మనం ఎప్పటి నుంచో వంట ఇంటి పోపు దినుసుగా ఉపయోగిస్తున్నాం. జీలకర్రను నిత్యం అనేక వంటల్లో వేస్తుంటారు. జీలకర్రను కూరల్లో వేస్తే కూరలు చక్కని వాసన వస్తాయి. రుచిగా కూడా ఉంటాయి. అయితే జీలకర్రలో మరో రకం జీలకర్ర కూడా ఉంటుంది. అదే నల్ల జీలకర్ర. దీన్ని చాలా మంది చూసి ఉండరు. కానీ నల్ల జీలకర్రను కూడా మనం ఉపయోగించవచ్చు. దీంతో అనేక లాభాలు కలుగుతాయి. నల్ల జీలకర్రను ఒక టీస్పూన్ మోతాదు లో తీసుకుని నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను రోజుకు ఒక కప్పు మోతాదులో ఉదయం తాగుతుండాలి. దీంతో అనేక ప్రయోజనాలు కలుగుతాయి. నల్ల జీలకర్రలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. థైమోక్వినోన్ అనే యాంటీ ఆక్సిడెంట్ వీటిల్లో సమృద్ధిగా ఉంటుంది. ఇది శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తుంది. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. క్యాన్సర్, గుండె జబ్బుల వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. కీళ్ల నొప్పులు, వాపులకు..: నల్ల జీలకర్రలో అధికంగా ఉండే థైమోక్వినోన్ అనే యాంటీ ఆక్సిడెంట్ యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కూడా కలిగి ఉంటుంది. అందువల్ల ఈ జీలకర్రను వేసి మరిగించిన నీళ్లను రోజూ సేవిస్తుంటే కీళ్ల నొప్పులు, వాపులు తగ్గుతా యి. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. నల్ల జీలకర్రలో ఇమ్యునో మాడ్యులేటరీ గుణాలు ఉంటాయి. అంటే దీన్ని తీసుకుంటే రోగ నిరోధక వ్యవస్థ బలంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరం వ్యాధులు, ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది.

# వేప పండ్ల గురించి ఈ నిజాలు తెలుసా..?

**ప్రకృతి మనకు అందించిన ఆరోగ్య ప్రదాయిని ఇవి..!**

వేప చెట్టు లేని ఊరిలో అసలు ఉండకూడదు.. అని మన పూర్వీకులు చెబుతుండేవారు. ఎందుకంటే ఆయుర్వేద ప్రకారం వేప అనేక ఔషధ గుణాలను కలిగి ఉంటుంది. ఈ చెట్టులోని ప్రతి భాగం మనకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అందుకనే మన పెద్దలు వేప చెట్టు గురించి అంత గొప్పగా చెబుతుండేవారు. వేప చెట్టుకు చెందిన ఆకులు, బెరడు, పువ్వులు.. ఇలా అన్నీ ఉపయోగకరమే. అలాగే వేప పండ్లు కూడా మనకు ఎంతో మేలు చేస్తాయి. వేప పండ్ల నుంచి నూనెను తీసి ఉపయోగిస్తుంటారు. వేప పండ్లను కొందరు ఎండబెట్టి డ్రై ఫ్రూట్స్ రూపంలో తింటారు. వే పండ్లను నేరుగా తింటే చేదుగా ఉంటాయి. కనుక వాటిని ఎండ బెట్టి తినవచ్చు. వేప పండ్లను తినడం వల్ల ఎన్నో అద్భుతమైన ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేదం చెబుతోంది.

నులి పురుగుల సమస్యకు..: వేప పండ్లలో యాంటీ వార్మ్ గుణాలు ఉంటాయి. అంటే పొట్టలో నులి పురుగులు ఉన్నవారు ఈ పండ్లను తింటే ఆ పురుగులు నశిస్తాయి. వేప పండ్లలో ఉండే సమ్మేళనాలు పొట్టలో ఉండే పురుగులను చంపేస్తాయి. దీంతో నులి పురుగుల సమస్య నుంచి బయట పడవచ్చు. పెద్దలకే కాదు ఈ చిట్కా పిల్లలకు కూడా మేలు చేస్తుంది. వేప పండ్లలో యాంటీ మలేరియల్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ పండ్లను తీసుకుంటే మలేరియా నుంచి త్వరగా కోలుకుంటారు. ఈ పండ్లలో ఉండే సమ్మేళనాలు మలేరియాకు కారణం అయ్యే క్రిములను చంపేస్తాయి. దీంతో జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు. వేప పండ్లలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ పండ్లను తింటుంటే నొప్పులు, వాపులు తగ్గుతాయి. ముఖ్యంగా కీళ్లు, మోకాళ్ల నొప్పులు ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.


చర్మ సమస్యలకు..: వేప పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో కణాలపై పడే ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. కణాలు సురక్షితంగా



ఉంటాయి.క్యాన్సర్, గుండె జబ్బులవంటి ప్రాణాంతకవ్యాధులు రాకుం డా అడ్డుకోవచ్చు. వేప పండ్ల గుజ్జును రాస్తుంటే ఎలాంటి చర్మ సమస్యలు అయినా ఇట్టే తగ్గిపోతాయి. గజ్జి, తామరతోపాటు చర్మంపై వచ్చే దురదలు, దద్దుర్లు తగ్గిపోతాయి. వేప పండ్లలో యాంటీ సెప్టిక్, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి చర్మ సమస్యలను తగ్గిస్తాయి. వేప పండ్లు అందుబాటులో లేకపోతే వాటి నుంచి తీసిన నూనెను కూడా చర్మ సమస్యలను తగ్గించేందుకు ఉపయోగించవచ్చు. జీర్ణ వ్యవస్థకు..: వేప పండ్లను తింటుంటే జీర్ణ వ్యవస్థకు ఎంతగానో మేలు జరుగుతుంది. జీర్ణ క్రియ మెరుగు పడుతుంది. మలబద్దకం నుంచి బయటపడతారు. గ్యాస్,అసిడిటీ, కడుపుఉబ్బరం వంటి జీర్ణ సమస్యలు తగ్గుతాయి. జీర్ణాశయం, పేగుల్లో ఉండే వ్యర్థాలు బయటకు పోతాయి. శరీరం శుభ్రంగా మారుతుంది. రక్తాన్ని శుద్ధి చేసే గుణాలు వేప పండ్లలో ఉన్నాయని ఆయుర్వేదం చెబుతోంది. వేప పండ్లను రోజూ తింటుంటే రక్తంశుద్ధి అవుతుంది.దీంతో రక్త సంబంధ వ్యాధుల నుంచి బయట పడవచ్చు. వేప పండ్లలో సహజసిద్ధమైన ఇన్‌సెక్టిసైడల్ గుణాలు ఉంటాయి. అంటే ఈ పండ్ల ద్వారా పురుగులు, క్రిమి కీటకాలను నాశనం చేయవచ్చు. ముఖ్యంగా వ్యవసాయం చేసేవారికి ఈ పండ్లు సహజసిద్ధమైన ఎరువుగా, పోషక పదార్థంగా ఉపయోగ పడతాయి. దీంతో పంటను నాశనం చేసే పురుగులు, క్రిమికీటకాలు నశిస్తాయి. అలాగే పంటకు పోషణ లభించి దిగుబడి ఎక్కువగా వస్తుంది. ఇలా వేప పండ్లతో అనేక లాభాలను పొందవచ్చు.

# మన చుట్టూ పరిసరాల్లోనే కనిపించే పువ్వులు ఇవి..

**విడిచిపెట్టకుండా తెచ్చి వాడండి.. ఎందుకంటే..?**



చూసేందుకు ఎంతో ఆకర్షణీయంగా నీలి రంగులో ఉండే ఈ పువ్వులను మీరు గమనించారా..? ఇవి మన చుట్టూ పరిసరాల్లోనే కనిపిస్తుంటాయి. శంఖపుష్పి అనే తీగ జాతికి చెందిన మొక్కకు ఈ పువ్వులు పూస్తాయి. ఈ పువ్వులు తెలుపు లేదా నీలి రంగులో ఉంటాయి. అయినప్పటికీ నీలి రంగు పువ్వులతోనే మనకు ఎక్కువ ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేదం చెబుతోంది. ఆయుర్వేదంలో పలు రకాల ఔషధాలను తయారు చేయడంతోపాటు పలు వ్యాధులను నయం చేసేందుకు శంఖపుష్పి మొక్కను ఉపయోగిస్తుంటారు. ఈ మొక్కకు చెందిన తీగ, వేర్లు, ఆకులు కూడా ఉపయోగకరమే. అయితే సాధారణంగా ఈ మొక్కకు పూసే నీలి రంగు పువ్వులనే అధికంగా ఉపయోగిస్తుంటారు. ఈ పువ్వుల్లో అనేక ఔషధ గుణాలు ఉంటాయి.

మెదడుకు టానిక్..: శంఖపుష్పి పువ్వులను వాడడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఏకాగ్రతగా పనిచేస్తారు. ఏదైనా అంశంపై ఎక్కువగా దృష్టి పెట్టగలుగుతారు. దీంతో ఆలోచనా శక్తి పెరుగుతుంది. పనిచేసే విషయాల్లో రాణిస్తారు. తెలివి తేటలు పెరుగుతాయి. మెదడు వికాసం చెంది యాక్టివ్‌గా పనిచేస్తారు. చురుగ్గా ఉంటారు. బద్ధకం పోతుంది. ఎల్లప్పుడూ ఉత్సాహంగా కనిపిస్తారు. మానసిక శక్తి పెరుగుతుంది. మానసికంగా దృఢంగా, ఆరోగ్యంగా ఉంటారు. ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. డిప్రెషన్‌తో బాధపడుతున్నవారికి ఈ పువ్వులు చక్కని ఔథషంలా పనిచేస్తాయి. మానసికంగా ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటారు. శంఖపుష్పి మెదడుకు టానిక్‌లా పనిచేస్తుంది. మెదడు కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. దీంతో వృద్ధాప్యంలో మతిమరుపు రాకుండా చూసుకోవచ్చు.

గాఢ నిద్ర కోసం..: శంఖపుష్పి పువ్వులను వాడితే ఒత్తిడి, ఆందోళన తగ్గి మైండ్ రిలాక్స్ అవుతుంది. దీంతో నిద్ర చక్కగా పడుతుంది. రాత్రి పూట పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. మరుసటి రోజు ఉదయం ఉత్సాహంగా నిద్ర లేస్తారు. ఈ పువ్వుల్లో బయో యాక్టివ్ సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి శరీరాన్ని రక్షిస్తాయి. దీంతో గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. శంఖపుష్పి పువ్వుల్లో హైపో లిపిడెమిక్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ పువ్వులను వాడితే శరీరంలోని కొలెస్ట్రాల్ కరిగిపోతుంది. రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. రక్త సరఫరా మెరుగు పడుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

ఎలా వాడాలి..?: శంఖపుష్పి పువ్వుల్లో ఇమ్యునో మాడ్యులేటరీ గుణాలు ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. శరీరం వ్యాధులు, ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడేలా చేస్తాయి. శంఖపుష్పిని వాడడం వల్ల జీర్ణ శక్తి మెరుగు పడుతుంది. మలబద్ధకం తగ్గుతుంది. ఇలా ఈ పువ్వులతో అనేక లాభాలను పొందవచ్చు. అయితే ఈ పువ్వులను ఎలా వాడాలంటే.. నాలుగైదు శంఖపుష్పి పువ్వులను తీసుకుని నీటిలో వేసి మరిగించి అనంతరం వడకట్టాలి. ఈ నీళ్లు గోరు వెచ్చగా ఉండగానే అందులో కాస్త నిమ్మరసం, తేనె కలిపి తాగేయాలి. ఈ విధంగా శంఖపుష్పి పువ్వులను వాడుతుంటే ఎన్నో అనారోగ్య సమస్యలను తగ్గించుకోవచ్చు.

# గౌట్‌కు మందు కాకరకాయ



ప్రస్తుతం మనదేశంలో చాలామంది యూరిక్ ఆమ్లం సమస్యతో బాధపడుతున్నారు. మన శరీరంలో ప్యూరిన్ అనే మూలకం విచ్ఛిన్నం వల్ల యూరిక్ ఆమ్లం తయారవుతుంది. ఇది రక్తం ద్వారా కిడ్నీలకు చేరుతుంది. మూత్రం ద్వారా బయటికి వెళ్లిపోతుంది. అయితే, యూరిక్ ఆమ్లం మూత్రంలో బయటికి వెళ్లనప్పుడు శరీరంలో దాని పరిమాణం పెరుగుతూ వస్తుంది. దీనివల్ల కీళ్లనొప్పులు వస్తాయి. లేవడం, కూర్చోవడం కష్టమైపోతుంది. దీన్నే గౌట్ అని పిలుస్తారు. యూరిక్ ఆమ్లం పేరుకోవడం వల్ల గుండెజబ్బులు, అధిక రక్తపోటు, కిడ్నీల్లో రాళ్లు, ఆర్థరైటిస్ లాంటి సమస్యలూ తలెత్తుతాయి. కాబట్టి, దీన్ని సరైన సమయంలో గుర్తించి అదుపులో పెట్టుకోవాలి. ఈ దిశగా కాకరకాయ జ్యూస్ మంచి ఔషధంగా పనిచేస్తుంది. ఆహార విధానంలో ఏవైనా మార్పులు చేసుకోవడానికి ముందు వైద్యుల సలహా తప్పనిసరి.

కాకరకాయ జ్యూస్ ప్రయోజనాలు ఏంటో చూద్దాం

యూరిక్ ఆమ్లం తగ్గింపులో కాకరలో ఔషధ గుణాలు అపారం. ఓ గ్లాసెడు కాకరకాయ రసం క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరంలో యూరిక్ ఆమ్లం స్థాయులు సహజంగానే తగ్గిపోతాయి. కాకరలో ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, విటమిన్ సి, కాల్షియం, బీటా కెరాటిన్ లాంటివి సమృద్ధిగా ఉంటాయి. ఇవి గౌట్ నివారణలో దోహదపడతాయి.

మధుమేహానికి మందుగా: మధుమేహం నియంత్రణలో కూడా కాకరకాయ ఎంతో ప్రయోజనకారి. విటమిన్ ఎ, సి, బీటా కెరాటిన్, ఇతర మినరల్స్, ఫైబర్ వల్ల ఇది ఇన్సులిన్‌లా పనిచేస్తుంది. రక్తంలో పెరిగే చక్కెర స్థాయుల నిర్వహణలో గొప్పగా ఉపయోగపడుతుంది.

ఎలా తీసుకోవాలి?: ప్రతిరోజూ పొద్దునే పరగడుపున ఓ సగం కప్పు కాకరకాయ జ్యూస్ తీసుకోవాలి. దీనికి సైంధవ లవణం, లేదంటే నిమ్మరసం కలుపుకొంటే చేదు తగ్గుతుంది. గౌట్, ఆర్థరైటిస్ సమస్యల విషయంలో కాకరకాయ జ్యూస్ మేలుచేస్తుంది. జ్యూస్ ఒక్కటి మాత్రమే కాకుండా, కాకరకాయతో రకరకాల కూరలు చేసుకుని తినడమూ మంచిదే. కాకరకాయ పొడి కూడా తీసుకోవచ్చు. దీనికోసం కాకరకాయను బాగా కడగాలి. ఆ తర్వాత దాన్ని ముక్కలుగా చేసి, నీడలో ఆరబెట్టాలి. ఆ తర్వాత వాటిని నూరి పొడిగా చేసుకోవాలి. ఈ పొడిని రోజూ పొద్దునే సగం టీస్పూన్ గానీ, టీస్పూన్ గానీ నీళ్లతో కలుపుకొని సేవించాలి.

# మరో ప్రాజెక్టు కోసం 4,200 ఎకరాల భూసేకరణ

**మహబూబ్ నగర్ ,తెలంగాణ దిశ :**కొడంగల్–నారాయణపేట ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టు కోసం 4,200 ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. లక్ష ఎకరాలకు సాగునీరు అందించే ఈ పథకానికి త్వరలోనే పర్యావరణ అనుమతులు లభించే అవకాశం ఉంది. రూ.4,885 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టు పనులు వేగవంతం కానున్నాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణం ద్వారా వికారాబాద్, నారాయణపేట జిల్లాలోని పలు మండలాలకు సాగు నీరు అందించనున్నారు.ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో నిర్మించ తలపెట్టిన కొడంగల్–నారాయణపేట ఎత్తిపోతల పథకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టు కోసం 4,200 ఎకరాల భూసేకరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలోనే ఈ పథకానికి పర్యావరణ అనుమతులు జారీ అయ్యే అవకాశం ఉంది. దీనికోసం రాష్ట్రస్థాయి పర్యావరణ ప్రభావ మదింపు మండలి హైదరాబాద్‌లో సోమవారం సమావేశమైంది. గతంలో జరిగిన బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నివేదికలను పరిశీలించి, ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.ఈ ఎత్తిపోతల పథకం పూర్తయితే.. వికారాబాద్, నారాయణపేట జిల్లాల పరిధిలోని కోస్గి, నారాయణపేట, దౌల్తాబాద్,బొంరాస్‌పేట, కొడంగల్, ధన్వాడ, ఊట్కూరు, మక్తల్, మద్దూర్, దామరగిద్ద మండలాల్లోని భూములకు సాగు నీరందుతుంది. భూసేకరణలో భాగంగా ఎకరాకు గరిష్ఠంగా రూ. 20 లక్షల పరిహారం చెల్లించనున్నట్లు ఇంజినీర్లు ఎస్ఇఏసీకు తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం 4,425 చెట్లను తొలగించాల్సి ఉంది. అలా తొలగించిన చెట్ల స్థానంలో కాలువలు, చెరువుకట్టలపై పదింతల చెట్లను పెంచుతామని అధికారులు హామీ ఇచ్చారు.ఈ ఎత్తిపోతల పథకం కోసం రూ. 4,885 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంత భారీ మొత్తంతో నిర్మిస్తున్న ఈ పథకంలో 209 మెగావాట్ల సామర్థ్యం గల పంపులను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పంపుహౌస్‌లు, ప్రెజర్ మెయిన్ల నిర్మాణానికి ప్రభుత్వం టెండర్లు పిలిచి, పనులు అప్పగించింది. పర్యావరణ అనుమతులు మంజూరై, భూసేకరణ పూర్తయితే.. ప్రాజెక్టు నిర్మాణ పనులు శరవేగంగా ముందుకు సాగుతాయి.డిసెంబర్ 8న కాలుష్య నియంత్రణ మండలి, నీటిపారుదల శాఖలు ఈ ప్రాజెక్టు పరిధిలోని రెండు ప్రాంతాల్లో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ సభలు నిర్వహించాయి.ఆ నివేదికల ఆధారంగానే ఎస్ఇఏసీ సమావేశం జరిగింది. ఇంజినీర్ల అంచనా ప్రకారం, కొద్దిరోజుల్లోనే పర్యావరణ అనుమతులు జారీ అయ్యే అవకాశాలున్నాయి. ఆ వెంటనే భూసేకరణ జరిపి.. పనులు వేగవంతం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# 3 జిల్లాలో 6 అర్బన్ ఫారెస్టులు



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 'నగర్ వన్ యోజన' కింద రాష్ట్రంలోని మూడు జిల్లాల్లో 6 అర్బన్ ఫారెస్టుల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. వీటి అభివృద్ధికి రూ. 8.26 కోట్లు మంజూరు చేసింది. పట్టణాల్లో పచ్చదనం పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. కాగా, పట్టణాల్లో ఏర్పాటు చేయబోయే ఈ వనాలల్లో స్థానిక వృక్ష జాతులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలంగాణ అటవీ శాఖ అధికారులు తెలిపారు.తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. తెలంగాణలోని మూడు జిల్లాల్లో 6 అర్బన్ ఫారెస్ట్‌లు అభివృద్ధి చేయడానికి ఆమోదం తెలిపింది. ఈ మేరకు 'నగర్ వన్ యోజన' కింద రాష్ట్రానికి రూ. 8.26 కోట్లు మంజూరు చేసింది. అర్బన్ ఫారెస్టుల ఏర్పాటుకు సంబంధించి విడతల వారీగా నిధులు విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. అందులో భాగంగా తొలివిడతలో 70 శాతం నిధులు విడుదల చేసింది. ఈ మేరకు తెలంగాణ అటవీ శాఖ అధికారులు వివరాలు వెల్లడించారు.పట్టణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం.. నగర్ వన్ యోజన పథకాన్ని 2020 జూన్ 5న ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది.పట్టణాల పరిధిలో అర్బన్ ఫారెస్ట్‌ల ఏర్పాటు ద్వారా.. పర్యావరణ సమతుల్యత కాపాడడం, కాలుష్యాన్ని తగ్గించడం ప్రజలకు ఆరోగ్యకర మైన జీవన వాతావరణాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కాగా, మొదటి ఐదేళ్లలో 200 పట్టణాల్లో అర్బన్ ఫారెస్టులను అభివృద్ధి చేయాలని టార్గెట్ పెట్టుకుంది. ఇప్పుడు 1000 నగరాల్లో వీటిని అభివృద్ధి చేయాలని కేంద్రం భావిస్తోంది. అందులో భాగంగాతాజాగా తెలంగాణలో 6 అర్బన్ ఫారెస్టులకు ఆమోదం తెలిపింది.మరోవైపు, పట్టణాల్లో నగర్ వన్ యోజన కింద ఏర్పాటయ్యే అర్బన్ ఫారెస్ట్‌లల్లో.. స్థానిక వృక్ష జాతికి చెందిన మొక్కలకు ప్రాధాన్యం ఇస్తున్నారని అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఇవి అర్బన్ ప్రజలకు ప్రకృతిలో గడిపిన అనుభూతిని అందిస్తాయని చెప్పారు. ఈ పట్టణ వనాల్లో వాకింగ్ ట్రాక్‌లు, విశ్రాంతి కేంద్రాలు, పచ్చని మైదానాలు ఏర్పాటు చేయనున్నారు.ఆదిలాబాద్, మంచిర్యాల, మేడ్చల్– మల్కాజ్‌గిర్ జిల్లాలో ఈ 6 అర్బన్ ఫారెస్టులను అభివృద్ధి చేయనున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో మావళా, యాపల్‌గూడ?ఎఎ పట్టణాల్లో అర్బన్ ఫారెస్టులు ఏర్పాటు కానున్నాయి. ఇక మంచిర్యాల జిల్లాలో ఇందారం (క్యాతనపల్లి మండలం), చెన్నూర్‌లలో ఏర్పాటు చేస్తారు. మేడ్చల్ ?మల్కాజ్‌గిరి జిల్లాలో యెల్లంపేట, చెంగిచెర్లలో పట్టణ వనాలు అభివృద్ధి చేయనున్నారు.మరోవైపు, తెలంగాణలో 9 జిల్లాల్లోని మున్సిపాలిటీల పరిధిలో.. 14 అర్బన్ ఫారెస్టులను ఏర్పాటు చేయనున్నట్లు 2025 డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఒక్కో పార్కుకు రూ. 2 కోట్ల చొప్పున.. రూ. 28 కోట్లను కేటాయించింది. తాజాగా మూడు జిల్లాలో ఆరు పట్టణ వనాలకు నిధులు విడుదల చేసింది. మిగతా వికారాబాద్ (4), భూపాలపల్లి (1),కొత్తగూడెం (1), జగిత్యాల (1), పెద్దపల్లి (1) జిల్లాలోని పట్టణ వనాలకు నిధులు మంజూరు చేయాల్సి ఉంది.

# బొంద రాజకీయాలు..!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం "బొంద పెట్టాలి" అనే పదం చుట్టూ పెద్ద దుమారమే రేగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, దానికి బీఆర్ఎస్ ఇస్తున్న కౌంటర్లు ఇప్పుడు రాష్ట్రంలో హాట్ టాపిక్ అయ్యాయి. ఖమ్మం వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరలేపాయి. ఒకప్పుడు తాను పెరిగిన తెలుగుదేశం పార్టీని తెలంగాణలో నామరూపాలు లేకుండా చేసిన కేసీఆర్‌పై రేవంత్ తన కసిని వెళ్లగక్కారు. అయితే, దీనికి బీఆర్ఎస్ ఇస్తున్న రిటార్ట్ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ముఖ్యమంత్రి అయినప్పటికీ, ఆయన రాజకీయ ప్రస్థానం టీడీపీ నుంచే మొదలైంది. తెలంగాణలో నేడు టీడీపీకి బలమైన నాయకత్వం లేకపోయినా, క్షేత్రస్థాయిలో ఆ పార్టీ సానుభూతిపరులు, కేడర్ ఇంకా ఉన్నారు. గత ఎన్నికల్లో టీడీపీ పోటీకి దూరంగా ఉండటంతో,ఆ ఓటు బ్యాంకులో మెజారిటీ కాంగ్రెస్‌కు మళ్లినట్లు విశ్లేషణలు ఉన్నాయి. ఏపీలో చంద్రబాబుకు వ్యతిరేకంగా కేసీఆర్, జగన్ చేతులు కలిపారనే భావన టీడీపీ అభిమానుల్లో బలంగా ఉంది. దీనిని క్యాష్ చేసుకునేందుకే రేవంత్ రెడ్డి "టీడీపీని దెబ్బతీసిన కేసీఆర్‌ను, ఆయన బీఆర్ఎస్ పార్టీని బొంద పెట్టాలి" అంటూ సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగించారు.రేవంత్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అగ్రనేతలు తీవ్రంగా స్పందిస్తూ ఒక చారిత్రక కోణాన్ని ముందుకు తెచ్చారు. తెలుగుదేశం పార్టీ పుట్టిందే కాంగ్రెస్ వ్యతిరేక భావజాలంపైన..! ఎన్టీఆర్ తన జీవితాంతం కాంగ్రెస్ అరాచక పాలనపైనే పోరాడారు. "ఎన్టీఆర్ ఆత్మ శాంతించాలంటే ఆయన బద్ధశత్రువైన కాంగ్రెస్‌నే బొంద పెట్టాలి కానీ, ఆయన శిష్యుడైన కేసీఆర్‌ను కాదు" అనేది బీఆర్ఎస్ వాదన. రేవంత్ రెడ్డి ఇప్పటికీ టీడీపీ ఏజెంట్‌గా కాంగ్రెస్‌లో పనిచేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.ప్రస్తుతం సోషల్ మీడియాలో నెటిజన్లు ఈ వ్యవహారంపై సెటైర్ల వర్షం కురిపిస్తున్నారు. ఒకవైపు రేవంత్ ఏమో బీఆర్ఎస్ ను బొంద పెట్టాలంటున్నారు. మరోవైపు బీఆర్ఎస్ ఏమో కాంగ్రెస్ ను బొంద పెట్టాలంటోంది. మరికొందరు నెటిజన్లు "అసలు ఒకప్పుడు టీడీపీలో కలిసి పనిచేసిన రేవంత్, కేసీఆర్.. ఇప్పుడు ఒకరినొకరు బొంద పెట్టుకుంటామనడం విడ్డూరంగా ఉంది" అని కామెంట్ చేస్తున్నారు.తెలంగాణలో టీడీపీ ఉనికి కోల్పోవడానికి కేసీఆర్ ఆపరేషన్ ఆకర్ష్ ప్రధాన కారణం అనడంలో సందేహం లేదు. ఓటుకు నోటు కేసు తర్వాత చంద్రబాబు ఏపీకి పరిమితం కావడం, ఇక్కడి నేతలంతా బీఆర్ఎస్ లో చేరిపోవడం చకచకా జరిగిపోయాయి. ఇప్పుడు రేవంత్ రెడ్డి పిలుపుతో పాత టీడీపీ శ్రేణులు ఆలోచనలో పడ్డాయి. అయితే, రేవంత్ కాంగ్రెస్ లో ఉండి టీడీపీ గురించి మాట్లాడటాన్ని కొంతమంది కాంగ్రెస్ విధేయులు కూడా జీర్ణించుకోలేకపోతున్నారు.తెలంగాణలో ఇప్పుడు పాత కక్షలు, పార్టీల మనుగడ చుట్టూ తిరుగుతోంది. రేవంత్ రెడ్డి తన 'టీడీపీ మూలాలను' వాడుకొని బీఆర్ఎస్ ను దెబ్బతీయాలని చూస్తుంటే, బీఆర్ఎస్ అదే 'ఎన్టీఆర్ సెంటిమెంట్'తో రేవంత్ ను ఇరకాటంలో పెట్టాలని చూస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ 'బొంద' రాజకీయం ఎవరికి లాభిస్తుందో చూడాలి.

# అమ్రాబాద్‌లో కొత్త అడ్వెంచర్

**మహబూబ్ నగర్,తెలంగాణ దిశ :**వన్యప్రాణి, ప్రకృతి ప్రేమికులకు తెలంగాణ అటవీ శాఖ తీపి కబురు అందించింది. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో త్వరలోనే 20 కిలోమీటర్ల సరికొత్త 'కొల్లాం' సఫారీ మార్గాన్ని ప్రారంభించనున్నట్లు అటవీ అధికారులు వెల్లడించారు. ఇందుకోసం రహదారి పనులను ఇప్పటికే పూర్తి చేశారు. ప్రస్తుతం అమ్రాబాద్‌లో మూడు రకాల సఫారీలు అందుబాటులో ఉన్నాయి. ఫరాహాబాద్ సఫారీ మె?త్తం 16 కి.మీ. ప్రయాణం కాగా... 7 సీట్ల వాహనానికి రూ. 3 వేలు ఛార్జ్ చేస్తున్నారు. గుండం సఫారీ దట్టమైన అడవిలో 35 కి.మీ. ప్రయాణం కాగా..వాహనానికి రూ. 5 వేలు, అక్కమహాదేవి గుహల సఫారీ 14 కి.మీ ప్రకృతి అందాల మధ్య ప్రయాణానికి.. 5 సీట్ల వాహనానికి రూ. 3 వేలు వసూలు చేస్తున్నారు.ఈ సఫారీ కార్యకలాపాలన్నీ కూడా స్థానిక చెంచు గిరిజనులే నిర్వహిస్తున్నారు. మొత్తం 18 సఫారీ వాహనాలకు వారే డ్రైవర్లుగా, నేచర్ గైడ్‌లుగా వ్యవహరిస్తూ పర్యాటకులకు అడవి గురించి వివరిస్తారు. దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని నేరుగా 'టైగర్ కన్జర్వేషన్ ఫౌండేషన్'కు, గిరిజనుల జీవనోపాధికి మళ్లిస్తున్నారు. పర్యావరణానికి హాని కలగకుండా టైగర్ రిజర్వ్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఫరాహాబాద్ వ్యూ పాయింట్, గుండం, దోమల పెంట వంటి ప్రాంతాల్లో బయో–టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు పర్యాటకులు రాకపోకలు సాగించే చోట స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం కల్పించారు. వన్యప్రాణుల కోసం అడవి లోపల సోలార్ బోర్ వెల్స్, నీటి కుంటలను నిర్వహిస్తున్నారు. 2025 అక్టోబర్ నుంచి ఇప్పటివరకు దాదాపు 50 సార్లు పులులు పర్యాటకులకు కనిపించడం ఇక్కడి అడవి ఆరోగ్యాన్ని సూచిస్తోంది.దేశ వ్యాప్తంగా జరుగుతున్న 'ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ 2026' (పులుల గణన) కారణంగా జనవరి 20 నుంచి 25 వరకు అమ్రాబాద్‌లో సఫారీ కార్యకలాపాలను నిలిపివేశారు. ఈ పులుల గణన కార్యక్రమంలో మె?త్తం 139 మంది అటవీ సిబ్బందితో పాటు 170 మంది వాలంటీర్లు పాల్గొంటున్నారు.

# సమగ్ర శాసనం కోసం



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** రాష్ట్రంలో 1930వ దశాబ్దం ప్రారంభం నుండి పారిశ్రామికాభివృద్ధి క్రమంగా వేగం పుంజుకుంది. పరిశ్రమల సంఖ్యతో పాటే కార్మికుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. అయితే, దీనికి తగ్గట్టుగా కార్మికుల రక్షణకు సమగ్రచట్టాలు లేవు. ఫ్యాక్టరీ యాక్టు వంటి ఒకటి, రెండు చట్టాలు ఉన్నప్పటికీ అవి అమలైన దాఖలాలు రాష్ట్రంలో ఎక్కడా లేవు. వేతనాల నుండి పని ప్రదేశాల్లో భద్రత వరకు ఒక్క అంశం కూడా అమలులోకి రాకపోవడంతో కార్మికుల పరిస్థితి ఘోరంగా మారింది. దీంతో కార్మికులను సంఘటితం చేసి,వారి హక్కుల పరిరక్షణ కోసం సమగ్ర శాసనం రూపొందించాలన్న డిమాండ్ ప్రారంభమైంది. సహజంగానే కమ్యూనిస్టు పార్టీ ఈ కృషిని భుజాన వేసుకుంది. కార్మికుల్లో విస్తృతంగా ప్రచారాన్ని ప్రారంభించింది. కార్మికులకు భద్రత, కనీస సౌకర్యాలు, హక్కులు, ఉద్యోగ భద్రత, పనిగంటలు, కార్మిక సంఘాలు ఏర్పాటుచేసుకునే హక్కు తదితర అంశాలను ఈ శాసనం చేర్చాలంటూ కమ్యూనిస్టులు చేసిన ప్రచారానికి మంచి స్పందన లభించింది. దీంతో 1937లో మద్రాసు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మంత్రివర్గం కార్మిక సమస్యలపై తన ఆలోచనలను తెలియచేస్తూ ఒక ప్రకటన చేసింది. కార్మిక వివాదాల్లో ఇరు పక్షాల మధ్య రాజీ కుదర్చడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని దీనిలో పేర్కొన్నారు. అదే సమయంలో కార్మికులు తమ సమస్యలను ప్రభుత్వానికి తెలియచేయాలని, సంప్రదింపులకు అవకాశం ఇవ్వాలని, తక్షణమే ప్రత్యక్ష ఆందోళనలకు దిగకూడదని కూడా సూచించింది. అయితే, ఈ ప్రకటన కార్మికులకు ఎటువంటి ఊరట ఇవ్వలేకపోయింది. యజమానులు కూడా ప్రభుత్వ ప్రకటనను ఖాతరు చేయకుండా కార్మికులను దోపిడి చేసేందుకే ప్రయత్నించారు. అనేక చోట్ల కార్మిక సంఘాలను సైతం గుర్తించలేదు. దీంతో కార్మికుల ఆందోళనలు తీవ్రమయ్యాయి. కాంగ్రెస్ నాయకులు ఎక్కడికెళ్లినా ఈ చట్టం గురించే కార్మికులు ప్రశ్నించేవారు. ఈ పరిస్థితుల్లో కార్మిక శాసనం రూపొందించడానికి మద్రాసు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో అప్పటికే ఉనికిలో ఉన్న వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు చర్చించుకుని విశాల ప్రాతిపదికన ఒక నివేదికను రూపొందించారు. 1939 మే 12న అప్పటి కార్మిక మంత్రి వివి గిరిని కలుసుకుని ఆ నివేదికను అందచేశారు. ఆ నివేదికలోని అంశాలను శాసనంలో పొందుపర్చాలని కోరారు. ఎనిమిది గంటల పనిదినం, వృద్ధాప్యం, అనారోగ్యం, అనాథ స్థితిలో ఉన్న కార్మికులకు జీవనోపాధి ఏర్పాటు చేయాలని, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు పని షరతులను నిర్ధారించాలని, షాపు, అసిస్టెంట్ సర్వీసు షరతులను న్యాయ సమ్మతంగా అమలు చేయాలన్నవి తక్షణ డిమాండ్లుగా ఈ నివేదికలో పేర్కొన్నారు.

# సొంత ఆయిల్ ఉత్పత్తిపై భారత్ దృష్టి




న్యూఢిల్లీ:భారత్ ప్రపంచంలో చమురు వినియోగ దేశాల్లో రెండో స్థానంలో ఉంది. మొదటిస్థానంలో చైనా ఉంది. భారత్ 90 శాతం చమురును విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. మూడేళ్లుగా జరుగుతున్న ఉక్రెయిన్?రష్యా యుద్ధంతో అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు రష్యా ఆయిల్ దిగుమతులు నిలిపివేశాయి. ఈ నేపథ్యంలో మిత్రదేశమైన రష్యాకు భారత్ అండగా నిలిచింది. మరోవైపు రష్య కూడా బహిరంగ మార్కెట్ కన్నా తక్కువ ధరకు ఇంధనం సరఫరా చేస్తోంది. అయితే దీనిని అమెరికా జీర్ణించుకోవడం లేదు. ఈ కరణంగానే అమెరికా అధినేత డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై 25 శాతం అదనపు సుంకాలు విధించారు. ఇంకా విధిస్తామని బెదిరిస్తున్నాడు. మరోవైపు వెనుజువెలా ఆక్రమణ నేపథ్యంలో రష్యాలోని షెల్ ఆయిల్‌ను భారత్‌కు సరఫరా చేయాలని ప్లాన్ వేస్తున్నాడు. ఈ క్రమంలో భారత్ వైవిధ్యమైన మార్గాలు అన్వేషిస్తోంది. ఇంధన భద్రతను బలోపేతం చేస్తోంది. తాజాగా యూఏఈ అధ్యక్షుడు మొహమ్మద్ బిన్ జాయెద్ పర్యటన సందర్భంగా మోదీతో కీలక చర్చలు జరిపారువెనెజువెలాలోని 'సాన్ క్రిస్టోబల్' ప్రాజెక్టుల్లో ఓఎన్జీసీకి పెద్ద వాటాలు ఉన్నాయి. 600 మిలియన్ డాలర్ల లాభాలు చమురు రూపంలో అందుతాయి. కానీ అక్కడి ముదురో ప్రభుత్వం కూలిపోవడంతో ఇప్పుడు సరఫరా ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు గయానాలో 11 బిలియన్ బ్యారెళ్ల నిల్వల్లో ఓఎన్జీసీ, రిలయన్స్ 2026 వేలంలో పాల్గొని ఉత్పత్తి హక్కులు సాధించబోతున్నాయిరష్యాలో ఓఎన్జీసీకి సాఖాలిన్?1లో 20%, వాంకోర్ క్షేత్రంలో 26% వాటాలు. 2009లో టామ్సక్ ప్రాంతంలో ఇంపీరియల్ ఎనర్జీని పూర్తిగా స్వాధీనం చేసుకుంది. ఈ ప్రాజెక్టులు భారత ఇంధన అవసరాలకు స్థిరమైన మద్దతు.అబుదాబిలో బీపీసీఎల్, ఐవోసీ కలిసి ꞉ఉర్జా భారత్' సంస్థ ఆన్‌షోర్ బ్లాక్?1లో చమురు కనుగొన్నాయి. తాజాగా ఎక్స్ఎన్?76 (షిలైఫ్) బావిలో తేలిక ముడి చమురు, ఎక్స్ఎన్?79 (హబ్షాన్)లో కొత్త నిక్షేపాలు లభించాయి. 6,162 చ.కి.మీ. విస్తీర్ణంలో 100% హక్కులతో పూర్తి ఉత్పత్తి అనుమతి. 2019 నుంచి సాగుతున్న అన్వేషణ దశ ముగిసి, భారీ పెట్టుబడులతో తవ్వకాలు మొదలయ్యాయి. యూఏఈ ఇంధన ఉత్పత్తిలో కూడా ఇప్పుడు భారత్‌కు అతిపెద్ద భాగస్వామిగా మారింది.సౌదీ సరఫరాలు, రష్యా?వెనెజువెలా?గయానా ప్రాజెక్టులు, అబుదాబి ఉత్పత్తి ? ఇవి భారతాన్ని దిగుమత ఆధారాల నుంచి స్వావలంబన వైపు నడిపిస్తున్నాయి. అమెరికా ఒత్తిడికి భారత్ స్వయం సమృద్ధి మార్గం ఎంపిక చేసుకుంది.

# పెద్దిరెడ్డికి బౌండరీస్..

**తిరుపతి,తెలంగాణ దిశ :**అధికారంలో ఉన్నప్పుడు అన్నీ కలిసి వస్తాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే నేతల బలాలు తెలుస్తాయి. ఇప్పుడు సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరిస్థితి అదే. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో ఆయన రాయలసీమకు ముఖ్యమంత్రిగా వ్యవహరించేవారు. రాయలసీమ పరిధిలోని నాలుగు జిల్లాలు ఆయన కంట్రోల్లో ఉండేవి. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సీనియర్ కావడం.. ఆయన కుమారుడు మిథున్ రెడ్డి జగన్మోహన్ రెడ్డికి సన్నిహితుడు కావడంతో తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించారు రామచంద్రారెడ్డి. చంద్రబాబుకు సమకాలీకుడు కావడంతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తన చెంత ఉంచుకున్నారు జగన్మోహన్ రెడ్డి. ఆయనకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. 2014లో రాయలసీమలో వైసీపీ హవా నడిచింది. 2019లో క్లీన్ స్వీప్ చేసింది. అంతవరకు ఓకే కానీ.. 2024 ఎన్నికల్లో అదే రాయలసీమలో ఏడు స్థానాలకు పడిపోయింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. దీంతో అదంతా హవా తప్ప పెద్దిరెడ్డి లాంటి సీనియర్ల ప్రమేయం లేదన్న నిర్ధారణకు వస్తున్నారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు.సొంత జిల్లా చిత్తూరులోపెద్దిరెడ్డి కంట్రోల్లో ఉండేది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అక్కడ భూమన కరుణాకర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆర్కే రోజా లాంటి నేతలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఉండేవారు. పెద్దిరెడ్డి పెద్దరికాన్ని అయిష్టంగానే గౌరవించేవారు. దానికి కారణం జగన్మోహన్ రెడ్డితో ఆయనకు ఉన్న సాన్నిహిత్యం. అయితే ఇప్పుడు మాత్రం సీన్ మారింది. ముఖ్యంగా నగిరి నియోజకవర్గ విషయంలో రోజా పట్టు బిగిస్తున్నారు. తన నియోజకవర్గంలో పెద్దిరెడ్డి మనుషుల పెత్తనాన్ని సహించుకోలేకపోయారు. జగన్మోహన్ రెడ్డికి ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోయేది. కానీ ఇప్పుడు మాత్రం పెద్దిరెడ్డి ప్రమేయాన్ని ఎంత మాత్రం సహించడం లేదు. పెద్దిరెడ్డి మనుషులను పార్టీ నుంచి బయటకు పంపుతారా? లేకుంటే తానే వెళ్లిపోమంటారా అంటూ రోజా గట్టిగానే హెచ్చరించినట్లు ప్రచారం నడుస్తోంది. ప్రస్తుతం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫుల్ సైలెన్స్ పాటిస్తున్నారు. భూమన కరుణాకర్ రెడ్డి తో పాటు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి జగన్ వద్ద ప్రాధాన్యత లభిస్తున్నట్లు సమాచారం. చెవిరెడ్డి అరెస్టు జరిగిన తర్వాత ఏ నేతకు లేనంత ప్రాధాన్యత ఆయనకు ఇస్తున్నట్లు తెలుస్తోంది. అసలు జైలుకెళ్లిన పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని జగన్ కలుసుకునేందుకు కూడా ఇష్టపడలేదట.

# సీబీఐ కీలకం

**కడప,తెలంగాణ దిశ :** వైఎస్ వివేకానంద రెడ్డిహత్య కేసు మరోసారి తెరపైకి వచ్చింది.. సిబిఐ ఇప్పటికే విచారణ పూర్తి చేసినట్లు చెప్పిన నేపథ్యంలో కొన్ని రకాల అనుమానాలు వ్యక్తం చేస్తూ వైయస్ సునీత ఇదే సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై ట్రయల్ కోర్టులో పిటిషన్ వేయాలని సూచించడంతో ఆమె కింది కోర్టును ఆశ్రయించారు. అయితే ఆమె లేవనెత్తిన అనుమానాలు, ఆపై నిందితులుగా భావిస్తున్న వారిని విచారించకుండానే సిబిఐ దర్యాప్తు పూర్తి అవ్వడాన్ని ప్రస్తావించారు. కానీ కింది కోర్టు అవేవీ పరిగణలోకి తీసుకోలేదు. దీంతో మళ్లీ ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈరోజు విచారణ జరగగా కోర్టు ఆసక్తికరమైన అంశాలను సిబిఐ ని అడిగి తెలుసుకుంది. వచ్చేనెల ఐదుకు విచారణను వాయిదా వేసింది. ప్రధానంగా ఈ కేసులో దర్యాప్తు పూర్తిస్థాయిలో ముగిసింది అని సిబిఐ కోర్టుకు చెబితే.. సుప్రీంకోర్టు ఈ కేసును ఒక కొలిక్కి తెచ్చే అవకాశం ఉంది. సిబిఐ దర్యాప్తు పూర్తిగా జరిగిందా? ఇంకేమైనా దర్యాప్తు చేయాల్సి ఉందా? అని అడిగింది కోర్టు. అయితే సునీత మాత్రం జగన్మోహన్ రెడ్డి దంపతులకు ముందుగానే ఎలా తెలిసింది అనేది సందేహం వ్యక్తం చేస్తూ వచ్చారు. అదే కీ పాయింట్ అని చెప్పుకొచ్చారు. వైయస్ వివేకానంద రెడ్డి హత్యకు గురయ్యారని జగన్మోహన్ రెడ్డి దంపతులకు ఎవరు చెప్పారు అన్నది సునీత సందేహం. రాజకీయ కోణంలోనే ఈ హత్య జరిగిందని ఆమె ఆది నుంచి సందేహంవ్యక్తం చేస్తూవచ్చారు. అయితేసుప్రీంకోర్టు ఆదేశాలతో ట్రైల్ కోర్టుకు సునీతరాగా.. అందరూ కుటుంబ సభ్యులు కావడం వల్లే సమాచారం ఇచ్చి ఉంటారని కోర్టు అభిప్రాయ పడింది. అయితే దీనితో ఏకీభవించలేదు సునీత. అందుకే మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇప్పుడు సుప్రీంకోర్టు సిబిఐ అభిప్రాయం అడిగింది. అంటే వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక ఘట్టం ఆసన్నం అయిం దన్నమాట. ఇప్పుడు సిబిఐ తన మనసులో ఉన్న మాటను కచ్చితంగా చెప్పాల్సిందే. సీరియస్ గా విచారణ చేపట్టామని చెప్పాలి. లేకుంటే కొంతమందినివిచారణ చేయాల్సి ఉందని చెప్పాలి. కానీ ఏదో ఒక విషయం మాత్రం స్పష్టంగా చెప్పాలి. అప్పుడే అత్యున్నత న్యాయస్థా నం సంచలన తీర్పు ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. ఒకవేళ సిబిఐ మళ్లీ దర్యాప్తును కోరితే మాత్రం అత్యున్నత న్యాయస్థానం సమ్మతించే అవకాశం ఉంది. అయితే ఇప్పుడు సిబిఐ ఏమి చెబుతోం ది అనేది హాట్ టాపిక్. ఆ విషయం వచ్చే నెల 5న తేలనుంది.

# 5 వేల కోట్ల కోసం 42 ఎకరాల భూమి అమ్మకం



**హైదరాబాద్,తెలంగాణ దిశ :**హైదరాబాద్‌లో మరోసారి భూములు వేలం వేయడానికి తెలంగాణ ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. మూసాపేట, బంజారాహిల్స్, కొండాపూర్‌లో మొత్తం 42 ఎకరాలను వేలం వేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీని ద్వారా సుమారు రూ. 5వేల కోట్లు సేకరించాలని టార్గెట్‌గా పెట్టుకుంది. దీనికి సంబంధించి హెచ్ఎండీఏ ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. అయితే గతంలో హైదరాబాద్‌లో జరిగిన భూముల వేలాల్లో రికార్డు ధరలు పలికాయి. దీంతో ఈసారి కూడా భారీ స్పందన వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో మరోసారి భూములు వేలం వేయడానికి సిద్ధమవుతోంది. మొత్తం 42 ఎకరాల భూమి వేలం వేయాలని నిర్ణయించింది. దీని ద్వారా దాదాపు రూ. 5 వేల కోట్లు సేకరించాలని టార్గెట్‌గా పెట్టుకుంది. కాగా, భాగ్యనగరంలో భూములు వేలం వేసిన ప్రతిసారి రికార్డు ధరలు పలుకుతున్నాయి. ఇటీవల కోకాపేటలో ఎకరం రూ. 151 కోట్లు పలికింది. అంతకుముందు రాయదుర్గంలో జరిగిన వేలంలో ఎకరం ఏకంగా రూ. 177 కోట్లు పలికి రికార్డు సృష్టించింది. ఈ తరుణంలో త్వరలో జరగబోయే వేలంలో ఎకరం ఎంత పలుకుతుంది అనేది ఆసక్తిగా మారింది.మూసాపేటలో 14 ఎకరాలు, బంజారాహిల్స్‌లో 8.37 ఎకరాలు, కొండాపూర్‌లో 20 ఎకరాల వేలం వేయడానికి హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) కసరత్తు చేస్తోంది. దాదాపు రెండు నెలల క్రితం కోకాపేటలో భూములు వేలం వేసినప్పుడే.. మూసాపేటలో భూములను కూడా విక్రయించాలనిలని ప్రభుత్వం భావించింది. అయితే భూములు వేలం వేయొద్దంటూ స్థానికులు, ప్రజాప్రతినిధుల నుంచి వ్యతిరేకత రావడం వల్ల.. ప్రభుత్వం వెనక్కి తగ్గింది. కాగా, ఆ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, రాత్రికి రాత్రే నిర్మాణాలు చేపడుతున్నారని అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడంతో మరోసారి ఈ భూముల వేలం మరోసారి తెరపైకి వచ్చింది. ఆ నివేదికను పరిశీలించిన ప్రభుత్వం.. స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చలు జరిపి భూములను వేలం వేసేందుకు ఆమోదం తెలిపింది.బంజారాహిల్స్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సుమారు 15 ఎకరాల వరకు ఉన్న భూమి.. చాలా వరకు కబ్జాకు గురైంది.
ప్రభుత్వ స్థలంలోకి నిర్మాణాలు చొచ్చుకొచ్చాయి.
దీంతో కొండ ప్రాంతాన్ని పక్కకు పెట్టి.. 8.37 ఎకరాలను విక్రయించాలని ప్రభుత్వం భావించింది. కొండాపూర్‌లో 20 ఎకరాలు, మూసాపేటలోని 14 ఎకరాలు కలిపి మొత్తం 42 ఎకరాలను ఆన్‌లైన్‌లో వేలం వేసేందుకు హెచ్ఎండీఏ కసరత్తు చేస్తోంది.మరోవైపు, హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చెందుతోంది. భారత్‌లోని టాప్ నగరాలతో పోటీ పడుతూ అత్యంత నివాసయోగ్యమైన ప్రాంతంగా గుర్తింపు పొందుతోంది. మౌలిక సదుపాయాలు, మానవవనరులు పుష్కలంగా ఉండటంతో.. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన సంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యాలయాలను ప్రారంభించడానికి ఆసక్తి చూపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారీ నిర్మాణ ప్రాజెక్టులు చేపట్టాలనుకునే సంస్థలకు భూములు దొరకడం కష్టంగా మారింది. ప్రైవేటు స్థలాలు వివిధ ప్రాంతాల్లో ఉన్నా.. విక్రయించడానికి యజమానులు ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో గతంలో టీజీఐఐసీ, హెచ్ఎండీఏలు వేలం వేసిన భూములకు మంచి రెస్పాన్స్ వచ్చింది. మూసాపేట, బంజారాహిల్స్, కొండాపూర్‌లో కూడా అలాంటి రెస్పాన్స్ వచ్చి.. రూ. 5 వేల కోట్ల టార్గెట్ చేరుకుంటామని ప్రభుత్వం భావిస్తోంది.

# సంపన్నుల సంపద భయం!

**తమ పై పన్నులేయాలంటూ బహిరంగ లేఖ**
**కార్పొరేట్ల నుండి దావోస్‌లో సంతకాల సేకరణ**
**వెబ్‌సైట్ పెట్టి ప్రచారం**




'సంపద ఒక వైపు కేంద్రీకృతమయ్యే కొద్దీ మరోవైపు పేదరికం, అభద్రత, పేదరికం పెరుగుతాయి. ఈ ప్రక్రియ కార్మిక వర్గంలో అశాంతి, ఆగ్రహం, విప్లవ చైతన్యాన్ని పెంచుతుంది' కొన్ని వందల సంవత్సరాల క్రితం కారల్ మార్క్స్ చెప్పిన మాట ఇది! సరళీకరణ ఆర్థిక విధానల ఫలితంగా మన దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో ప్రస్తుతం పెరుగుతున్న అంతరాల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.శతకోటీశ్వరుల సంపద అనూహ్యంగా పెరుగుతుండగా, సామాన్యుల రోజువారీ జీవనం కూడా కష్టమవుతున్న పరిస్థితులు చూస్తున్నాం. ఈ పరిస్థితి సంపన్నుల్లో సైతం ఆందోళనకు దారి తీస్తోందా? కార్మికవర్గం జీవన భద్రతను కూడా కోల్పోతే తిరుగుబాటు అనివార్యమన్న మార్క్స్ చెప్పిన మాట వారిని భయపెడుతోందా? దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరైన కొందరు శతకోటీశ్వర్లు తమపై తక్షణమే సంపద పన్ను విధించాలంటూ వివిధ దేశాల ప్రభుత్వాలను కోరుతూ విడుదల చేసిన బహిరంగ లేఖ ఇటువంటి అనుమానాలనే కలిగిస్తోంది. 24 దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 400 మంది సంపన్నులు ఆ లేఖపై సంతకాలు చేశారు. అంతటితో ఆగకుండా 'టైమ్ టు విన్ ' పేరిట ఒక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసి ప్రపంచవ్యాప్తంగా ఉన్న శతకోటీశ్వరు లను సంతకాలు చేయాలని కోరుతున్నారు. సంపద పన్నును విధించాలన్న డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోని విషయం తెలిసిందే. తాజాగా విడుదలైన లేఖపై సైతం మన దేశానికి చెందిన శత కోటీశ్వరులు ఎవ్వరూ సంతకాలు చేయకపోవడం గమనార్హం.

లేఖలో ఏముంది?: 'దావోస్‌కు హాజరైన మిత్రులారా×మనందరికీ ఇది గెలిచే సమయం' అన్న పేరుతో ఈ లేఖ విడులైంది. 'అత్యంత ధనికులు, మిగిలిన వారి మధ్య అంతరం రోజురోజుకి పెరుగుతోంది. పొరుగనే ఉన్న కాలనీల నుండి దేశాల వరకు ఈ చీలిక విస్తరించింది. ప్రపంచంలోని అత్యంత ధనికులపై ఒక్కశాతం మంది 95 శాతం మంది జనాభ వద్ద ఉన్న సంపద కన్నా ఎక్కువ పోగేసుకున్నారు. ఈ కొద్దిమంది ప్రజాస్వామ్యాలను కొనుగోలు చేశారు. ప్రభుత్వాలను ఆధీనంలోకి తీసుకున్నారు. మీడియా గొంతు నొక్కారు. సాంకేతికత, ఆవిష్కరణలపై పట్టు సాధించారు. పేదరికం, సామాజిక వెలివేతను మరింతగా పెంచుతున్నారు. మా లాంటి కొద్ది మంది వద్ద పోగుపడుతున్న సంపద సమాజాన్ని ప్రమాదపు అంచున నిలిపిందన్న దానిలో సందేహమే లేదు. అధిక సంపద కొద్ది మందికి అతి నియంత్రణకు అవకాశం ఇచ్చింది. అది మన భద్రమైన భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతొంది. ఇప్పుడు ఆ నియంత్రణకు ముగింపు పలకాల్సిన సమయం వచ్చేసింది. అత్యంత ధనికులపైన అంటే మాపైన పన్ను వేయండి. ఇది ప్రజాస్వామ్యాన్ని తిరిగి పొందడానికి దోహద పడుతుంది.' అని లేఖలో వారు పేర్కొన్నారు.

# తెలుగు రాష్ట్రాల మధ్య చిచ్చు

## 42 ఎకరాల భూమి

**విజయవాడ,తెలంగాణ దిశ :**హైదరాబాద్‌లోని అత్యంత ఖరీదైన కొండాపూర్ ప్రాంతంలో గల 42 ఎకరాల భూమి ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టింది. సుమారు 4,000 కోట్ల రూపాయల విలువ చేసే ఈ భూమిపై తమకే అధికారం ఉందంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయడంతో ఈ వివాదం సరికొత్త మలుపు తిరిగింది. కర్నూలు కేంద్రంగా పనిచేసే బాలసాయిబాబా సెంట్రల్ ట్రస్ట్ కు చెందిన ఈ భూములపై తెలంగాణ ప్రభుత్వానికి ఎలాంటి అధికారం లేదని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేయడం సంచలనంగా మారింది.ఈ వివాదానికి మూలాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలోనే ఉన్నాయి. కర్నూలు జిల్లా కేంద్రంగా బాలసాయిబాబా సెంట్రల్ ట్రస్ట్ రిజిస్టర్ అయింది. ఈ ట్రస్ట్‌కు కొండాపూర్‌లోని సర్వే నంబర్లు 105 నుంచి 108 వరకు సుమారు 42.03 ఎకరాల భూమి ఉంది. 2005లో అప్పటి ప్రభుత్వం జీఓ 2065 ద్వారా ఈ యూఎల్‌సీ మిగులు భూములను ట్రస్ట్‌కు క్రమబద్ధీకరించింది. బాలసాయిబాబా మరణం తర్వాత ట్రస్ట్ నిర్వహణ బాధ్యతలను ఏపీ దేవాదాయ శాఖ చేపట్టింది. కర్నూలు దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారిని ఈ ట్రస్ట్‌కు అధికారిగా నియమించారు.ఈ వివాదంలో ప్రైవేటు సంస్థ అయిన భూపతి ఎస్టేట్స్ ప్రవేశించడంతో సమస్య సంక్లిష్టంగా మారింది. 2023లో తెలంగాణ ప్రభుత్వం రెవెన్యూ రికార్డులలో మార్పులు చేస్తూ, ట్రస్ట్ పేరుకు బదులుగా 'భూపతి ఎస్టేట్స్' పేరును చేర్చింది. బాలసాయి బాబా ట్రస్ట్ భూములను ఈ ప్రైవేటు సంస్థకు అప్పగించడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. తమకు సమాచారం ఇవ్వకుండా, ఏపీ పరిధిలో ఉన్న ట్రస్ట్ భూములను తెలంగాణ ప్రభుత్వం ఎలా బదలాయిస్తుందని ఏపీ దేవాదాయ శాఖ ప్రశ్నిస్తోంది. ఈ క్రమబద్ధీకరణ చెల్లదని, తెలంగాణ తీసుకున్న నిర్ణయం చట్టవిరుద్ధమని ఏపీ ప్రభుత్వం వాదిస్తోంది.తమ్మనబోయిన సంతోష్ కుమార్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిల్ పై విచారణ సందర్భంగా ఏపీ దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్రమోహన్ కీలకమైన కౌంటర్ దాఖలు చేశారు. ఈ ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్ చట్టం కింద ఏపీలో రిజిస్టర్ అయింది. కాబట్టి దాని ఆస్తుల నిర్వహణ ఏపీ దేవాదాయ శాఖ పరిధిలోకే వస్తుంది. రాష్ట్ర విభజన తర్వాత ఆయా రాష్ట్రాల్లోని భూములు ఆ రాష్ట్రాలకే చెందుతాయన్న నియమం ఉన్నప్పటికీ, ఒక రాష్ట్ర దేవాదాయ శాఖ పరిధిలోని ట్రస్ట్ ఆస్తులను మరో రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు ఎలా కట్టబెడుతుందని ఏపీ ప్రశ్నిస్తోంది. ఈ భూములపై తెలంగాణకు ఎలాంటి పరిపాలనాపరమైన అధికారం లేదని ఏపీ తేల్చి చెప్పింది.తెలంగాణ ప్రభుత్వం ఈ భూములు తమ భౌగోళిక పరిధిలో ఉన్నాయని, స్థానిక రెవెన్యూ నిబంధనల ప్రకారమే మార్పులు జరిగాయని భావిస్తోంది. అయితే, ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్‌పై తెలంగాణ ప్రభుత్వం తన తదుపరి వాదనలను కోర్టులో వినిపించాల్సి ఉంది. గతంలో కొందరు పిటిషన్లు వేసి ఉపసంహరించుకోవడం వెనుక భారీ కుట్ర దాగి ఉందని ఏపీ ప్రభుత్వం ఆరోపిస్తుండటంతో, ఈ వ్యవహారం మరింత ముదిరేలా కనిపిస్తోంది.4,000 కోట్ల విలువైన భూమి కావడం, ఇందులో ఒక ఆధ్యాత్మిక ట్రస్ట్, ప్రైవేటు రియల్ ఎస్టేట్ సంస్థలు భాగస్వామ్యం కావడంతో ఈ కేసు తెలుగు రాష్ట్రాల్లో ఉత్కంఠ రేపుతోంది. హైకోర్టు ఇచ్చే తీర్పు రెండు రాష్ట్రాల మధ్య ఉన్న ఆస్తుల పంపకాల వివాదాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది.

# ఏపీలో కొత్త పార్టీలు


**విజయవాడ,తెలంగాణ దిశ :** ఏపీలో కొత్త పార్టీలు రానున్నాయా? ఆ స్పేస్ ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం ఏపీలో ప్రాంతీయ పార్టీల హవా నడుస్తోంది. జాతీయ పార్టీల ప్రభావం అంతంత మాత్రమే. అధికార టిడిపి, జనసేనలు ప్రాంతీయ పార్టీలు. వాటితో అధికారం పంచుకున్న బిజెపి జాతీయ పార్టీ. మరో ప్రతిపక్ష పార్టీగా వైసీపీ ఉంది. అది సైతం ప్రాంతీయ పార్టీ. ఇంకా చిన్నచితకా పార్టీలు ఉండనే ఉన్నాయి. అయితే ఇప్పుడు ప్రాంతీయ పార్టీల ఏర్పాటు అంశం అనేది హాట్ టాపిక్ అవుతోంది. ప్రధానంగా ఏబీ వెంకటేశ్వరరావు, విజయసాయిరెడ్డి, షర్మిలాలు కొత్త పార్టీలు పెడతారని ప్రచారం నడుస్తోంది. అయితే ఈ ముగ్గురు పార్టీలు పెడితే ఎవరికి నష్టం అంటే మాత్రం..
కచ్చితంగా జగన్మోహన్ రెడ్డికి. అయితే ఆ ముగ్గురు టార్గెట్ సైతం జగన్మోహన్ రెడ్డి పార్టీ అని తెలుస్తోంది. వారి పార్టీల ఏర్పాటు వెనుక కూడా ఒక రకమైన వ్యూహం ఉన్నట్లు సమాచారం. అయితే వారి పార్టీ ప్రకటన నేరుగా లేదు కానీ ప్రచారం మాత్రం జరుగుతోంది.ఏబీ వెంకటేశ్వరరావుజగన్మోహన్ రెడ్డి సర్కార్ బాధిత అధికారి. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి సర్కార్లు ఆయన ఇంటలిజెన్స్ అధికారిగా పనిచేశారు. అప్పట్లో వైసీపీ ఎమ్మెల్యేలు చాలామంది టీడీపీలో చేరారు. ఆ సమయంలో నిఘా అధిపతిగా ఉన్న ఆయన టిడిపికి అనుకూలంగా పనిచేశారన్న అనుమానం జగన్ లో ఉండేది. అందుకే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బాధితుడిగా మారారు ఏబీ వెంకటేశ్వరరావు. ఈ రాష్ట్రానికి డిజిపి కావాల్సిన అధికారి లూప్ హోల్స్ లో ఉండిపోయారు. ప్రమోషన్ పొందిన నాడే పదవీ విరమణ చేశారు. అయితే ఇంతటి మూల్యాన్ని చెల్లించుకున్న తనకు తెలుగుదేశం అధికారంలోకి వస్తే మంచి గుర్తింపు ఉంటుందని భావించారు. అయితే తన ఆలోచనకు తగ్గట్టు టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గుర్తింపు, పదవి దక్కలేదు. పైగా తాను ఆశించినట్టు వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డికి ట్రీట్మెంట్ ఇవ్వడం లేదన్న ఆవేదన ఉంది. మరోవైపు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు సైతం తనకు ఇబ్బందులు ఉన్నాయి. అందుకే ఆయన కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తానని ఇటీవల ప్రకటించారు.మరోవైపు విజయసాయిరెడ్డికొత్త పార్టీ పెడతారన్న ప్రచారం నడుస్తోంది. ఏడాది కిందట ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. రాజ్యసభ సభ్యత్వంతో పార్టీకి కూడా రాజీనామా చేశారు. ఇకనుంచి వ్యవసాయం చేసుకుంటానని చెప్పుకొచ్చారు.. అయితే ఆయన రూటు మార్చినట్టు కనిపిస్తున్నారు. ఇటీవల నిత్యం జగన్ కోటరిని టార్గెట్ చేసుకుంటున్నారు. ఈ క్రమంలో రెడ్డి సామాజిక వర్గాన్ని ఆకర్షించే వీలుగా ఒక కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయాలన్న ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. దీని వెనుక తెలుగుదేశం హస్తం ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. వచ్చే ఎన్నికల్లో మరోసారి రెడ్డి సామాజిక వర్గం మద్దతు జగన్మోహన్ రెడ్డికి దక్కకుండా విజయసాయిరెడ్డి తో పార్టీని ఏర్పాటు చేయిస్తున్నారన్న ప్రచారం మాత్రం జరుగుతోంది.వైయస్ షర్మిల కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెబుతారని కూడా టాక్ నడుస్తోంది. తెలంగాణలో తన తండ్రి పేరిట పార్టీ ఏర్పాటు చేసిన షర్మిల అక్కడ నడపలేకపోయారు. కాంగ్రెస్ పార్టీలో చేరి ఏపీ పగ్గాలు అందుకున్నారు. సోదరుడు జగన్తో వచ్చిన విభేదాలతో ఆయనను అధికారం నుంచి దూరం చేయాలని చూసారు.
ఆ విషయంలో సక్సెస్ అయిన ఏపీలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కాలేదు. అందుకే కాంగ్రెస్ అధినాయకత్వం షర్మిలను తప్పిస్తుందన్న ప్రచారం నడుస్తోంది. ఈ తరుణంలో ఆమె ప్రత్యేక రాయలసీమ సాధన కోసం ఒక పార్టీని ఏర్పాటు చేస్తారని టాక్ నడుస్తోంది. ఇటీవల రాజకీయంగా యాక్టివిటీస్ తగ్గించారు షర్మిల.
అందుకే ఈ ప్రచారం మరింతగా సాగుతోంది. అయితే వీరు రాజకీయ పార్టీలు ఏర్పాటు చేస్తారు అనేది ఒక్క ప్రచారం మాత్రమే. వారు పార్టీలు ఏర్పాటు చేస్తే మాత్రం అది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇబ్బంది కలిగించే విషయమే.

# కార్యకర్తలు సరే... లీడర్లు ఏరీ




**కడప,తెలంగాణ దిశ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాబోయే ఎన్నికల్ని లక్ష్యంగా చేసుకుని తన వ్యూహాలను పునర్వ్యవస్థీకరించుకునే ప్రయత్నంలో ఉంది. ప్రధానంగా ప్రజల మధ్యకు వెళ్లడం, ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడం, వచ్చే ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావడం అన్నదే పార్టీ ముందున్న ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే ఈ లక్ష్యాలు కార్యరూపం దాల్చడంలో మాత్రం స్పష్టత కొరవడినట్టు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని పార్టీ నిర్ణయించినప్పటికీ, ఆ ఉద్యమాలు పరిమిత స్థాయిలోనే కొనసాగుతున్నాయి. ఎక్కువగా కార్యకర్తలు, స్థానిక నాయకులకే ఈ బాధ్యతలు అప్పగించడంతో ప్రజల్లోకి బలమైన సంకేతం వెళ్లడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దాదాపు గత ఇరవై నెలలుగా పార్టీ చేపట్టిన పలు కార్యక్రమాల్లో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొనకపోవడం గమనార్హం. అంతేకాదు, ఆయనకు సన్నిహితుడిగా భావించే సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డి కూడా ఈ కార్యక్రమాల్లో ఎక్కడా కనిపించలేదు.ఈ పరిస్థితుల్లో పార్టీ పోరాటాలు కేవలం కార్యకర్తల స్థాయికే పరిమితమయ్యాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల మధ్యకు వస్తానని జగన్మోహన్ రెడ్డి గతంలో రెండు సార్లు తేదీలు ఇచ్చారన్న ప్రచారంజరిగింది. గత ఏడాది జూలై నెలలో ప్రజల్ని కలుస్తానని చెప్పినా, అది కేవలం కొద్ది సమయం పర్యటనకే పరిమితమైంది. ఆ తర్వాత ఈ ఏడాది జనవరి నుంచి విస్తృతంగా ప్రజల్లోకి వస్తానన్న మాట కూడా వాయిదా పడింది. తాజాగా పార్టీ వర్గాల్లో పాదయాత్రే తుది నిర్ణయం అన్న చర్చ నడుస్తోంది.అయితే ఈ పాదయాత్ర ఎప్పుడు అనే దానిపై స్పష్టత లేదు. పార్టీ నాయకుల మాటల్లో చెప్పాలంటే 2027 లేదా 2028 వరకూ దీనికి ముహూర్తం ఉండకపోవచ్చని అంటున్నారు. ఇప్పుడే పాదయాత్ర చేపట్టినా ఎన్నికలకు ఇంకా సమయం ఎక్కువగా ఉండటంతో దాని ప్రభావం తగ్గిపోతుందనే ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకుంటున్నారని సమాచారం. అందుకే ఎన్నికలకు ఒకటి లేదా రెండు సంవత్సరాల ముందు మాత్రమే పాదయాత్ర ప్రారంభించే యోచనలో ఉన్నారని చెబుతున్నారు .ఇదిలా ఉండగా, మధ్యలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు , కార్పొరేషన్ ఎన్నికలు పార్టీకి కీలకంగా మారనున్నాయి. ఈ ఎన్నికల్లో వైసీపీ ఎలా ముందుకు సాగుతుంది, ఎలాంటి వ్యూహాలు అమలు చేస్తుందన్నది పెద్ద ప్రశ్నగా మారింది. పైగా జగన్మోహన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై కూడా చర్చ సాగుతోంది. ఆయన మోకాళ్ల సమస్యతో పాటు నడుము నొప్పితో బాధపడుతున్నారని ప్రచారం ఉంది. బహిరంగంగా చెప్పకపోయినా, గత కొన్నేళ్లుగా ఆయన వ్యవహార శైలిని గమనిస్తే ఆరోగ్య ఇబ్బందులు ప్రభావం చూపుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది

# వెడ్డింగ్ హబ్ గా తిరుపతి



**తిరుపతి,తెలంగాణ దిశ :** కలియుగ ప్రత్యక్ష దైవంగా భక్తులు భావించే వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుమల లో వివాహం చేసుకోవడం అత్యంత పవిత్రమని చాలామంది విశ్వసిస్తారు. ఆ పవిత్ర వాతావరణంలో కొత్త జీవితం ప్రారంభిస్తే దాంపత్య జీవితం సుఖశాంతులతో, ఆరోగ్యంగా సాగుతుందని భక్తుల నమ్మకం. ప్రపంచ వ్యాప్తంగా పేరుగాంచిన ఆధ్యాత్మిక క్షేత్రం కావడంతో, అక్కడి ఆధ్యాత్మిక వాతావరణం వివాహ జీవితానికి శుభకారకమని భావిస్తారు. ఏడుకొండల వాడి సన్నిధిలో జరిగే పెళ్లిని ఎంతో పవిత్రంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు గౌరవిస్తారు.ఈ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తిరుమల?తిరుపతి ప్రాంతాన్ని వివాహాల కోసం ప్రత్యేక గమ్యస్థానంగా అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇటీవల పండుగ సందర్భంగా తన స్వగ్రామం నారావారిపల్లె కు వెళ్లిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుపతిని వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దే దిశగా అధికారులకు సూచనలు చేసినట్లు తెలుస్తోంది.ముఖ్యమంత్రి ఆదేశాలతో తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు, పర్యాటక శాఖ కలిసి ప్రత్యేక ప్యాకేజీపై కసరత్తు చేస్తున్నారని సమాచారం. ప్రస్తుతం తిరుమలలో ఏటా సుమారు పదిహేను వేల నుంచి ఇరవై వేల వరకు వివాహాలు జరుగుతున్నాయి. శుభ ముహూర్తాలు ఉన్న రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. తిరుపతి , తిరుచానూరు ప్రాంతాల్లో జరిగే పెళ్లిళ్లు వీటికి అదనమే.ఇప్పటికే టీటీడీ వివాహాలు చేసుకునే జంటలకు కొన్ని సౌకర్యాలు అందిస్తోంది.
'కళ్యాణ వేదిక' లో వివాహం చేసుకున్న వారికి ప్రత్యేక దర్శన అవకాశం, ఆశీర్వచన కార్యక్రమం, ప్రసాదాల పంపిణీ వంటి సదుపాయాలు ఉన్నాయి. అయితే ఈ వేదికలో ఆర్భాటాలకు అవకాశం తక్కువగా ఉండటంతో, కొందరు భక్తులు కొండపై ఉన్న ప్రైవేటు మఠాలు, సత్రాలు లేదా దిగువ ప్రాంతాల్లోని కల్యాణ మండపాలను ఎంచుకుంటున్నారు. తొండవాడ , శ్రీనివాసమంగాపురం వంటి ప్రాంతాలు కూడా పెళ్లిళ్లకు ప్రాధాన్యం పొందుతున్నాయి. అయితే ఈ విధంగా ఇతర చోట్ల వివాహాలు చేసుకునే వారికి ఇప్పటివరకు ప్రత్యేక దర్శన సౌకర్యాలు లేకపోవడం వల్ల భక్తుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ అంశం ప్రభుత్వ దృష్టికి రావడంతో, ఇకపై కళ్యాణ వేదిక వెలుపల పెళ్లి చేసుకున్నా కూడా శ్రీవారి దర్శనం, ఆశీర్వచనం, ప్రసాదాలు అందించే విధంగా కొత్త విధానం తీసుకురావాలని యోచిస్తోంది.వివాహ వేదిక అలంకరణ, భోజన ఏర్పాట్లు, రవాణా, వసతి వంటి సేవలను ప్రైవేటు సర్వీసు ప్రొవైడర్లకు అప్పగించి, ప్రభుత్వ పర్యవేక్షణలో ప్యాకేజీగా అందించా లని ప్రతిపాదనలు రూపొం దిస్తున్నారు. దీని వల్ల పెళ్లి చేసుకునే వారికి సౌలభ్యం కలగడంతో పాటు, స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలుపితే, తిరుమల?తిరుపతి ప్రాంతం ఆధ్యాత్మికతతో పాటు వివాహాల కోసం కూడా దేశవ్యాప్తంగా మరింత గుర్తింపు పొందే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.


# మిర్చి ధర పైపైకి..

**ఒక్కరోజే రూ.2,400 చొప్పున పెరిగిన ధర**
**సరుకు పెరిగినా ఇదే ధర ఉండాలని కోరుకుంటున్న రైతులు**



**రఘునాథపాలెం,తెలంగాణ దిశ :** ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధర పైపైకి వెళ్తున్నది. మంగళవారంతో పోల్చితే ఒక్క రోజులోనే భారీగా ధర పెరిగింది. ఈ ఏడాది ఇదే అధిక పెరుగుదల అని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. క్వింటా ఏసీ మిర్చి ధర రూ. 20,200, కొత్త మిర్చి ధర రూ.20 వేలకు చేరింది. దీంతో పంట విక్రయానికి తరలించిన రైతుల్లో ఆశలు చిగురించాయి. వారం రోజుల క్రితం వరకు పోల్చితే మిర్చి ధర కేవలం రూ.15 వేలకే పరిమితమైంది. అయితే రెండు రోజులుగా వరుసగా పెరుగుతూ వచ్చిన మిర్చి ధర బుధవారం నాటికి రూ.20 వేల మార్క్‌ను చేరింది. వ్యవసాయ మార్కెట్‌కు కొత్త మిర్చి భారీగా వస్తుండడంతో ధరలో పురోగతి కనిపిస్తున్నది. 2024లో మిర్చి క్వింటా ధర రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పలికింది. రెండేళ్లుగా తెలంగాణ మిర్చికి విదేశాల్లో డిమాండ్ లేకపోవడంతో ధర భారీగా పడిపోయింది. కాగా, ఈ ఏడాది తెగుళ్లు, అధిక వర్షాల కారణంగా దిగుబడులు పూర్తిగా తగ్గాయి. ఏటా లక్ష ఎకరాల్లో సాగయ్యే మిర్చి.. ఈ ఏడాది కేవలం 40 వేల ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. ఈ క్రమంలో దిగుబడులు తగ్గడంతో విదేశీ మార్కెట్‌లో మిర్చికి డిమాండ్ పెరిగింది. కాగా, బుధవారం ఖమ్మం మార్కెట్‌కు 13 వేల బస్తాలు వచ్చినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. సీజన్‌లో మార్కెట్‌కు వచ్చే సరుకు పెరిగినప్పటికీ ఇదే ధర నిలకడగా ఉండాలని రైతులు కోరుతున్నారు.

# సామ్రాజ్యవాద పెనుముప్పు




అమెరికా సామ్రాజ్యవాదం బుసలుకొడుతోంది. నిన్న వెనిజులాపై ఆకస్మిక దాడి చేసి, వందలాదిమందిని హత్య చేసి, అధ్యక్షుడు మదురోను, ఆయన భార్యను అర్ధరాత్రి వేళ సైనిక విమానంలో ఎత్తుకెళ్లడం, నేడు గ్రీన్‌లాండ్స్‌ను కబళించేందుకు సిద్ధం కావడం, ఇరాన్, క్యూబా, మెక్సికో, కొలంబియా లాంటి దేశాలపై బెదిరింపులకు దిగడం× ఇవన్నీ సామ్రాజ్యవాద వికృతరూపానికి ఆనవాళ్లు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడుతో పాటు అగ్రరాజ్య దురహంకారానికి ప్రతిరూపాలే.

ప్రస్తుతం గ్రీన్‌లాండ్‌పై యుద్ధ మేఘాలు ఆవరించాయి. ఆ ద్వీపంలోని కీలక సైనిక స్థావరం పిటుఫిక్ స్పేస్ బేస్‌కు సైనిక విమానం పంపుతున్నట్లు ఇప్పటికే అమెరికా ప్రకటించింది. ప్రపంచంలోనే అతి పెద్దదైన ఈ దీవిలో అత్యంత అరుదైనవిగా ప్రకటించిన 34 ఖనిజాల్లో గ్రాఫైట్, లిథియం వంటి 25 ఖనిజాలు అపారంగా ఇక్కడ ఉన్నాయి. విద్యుత్ వాహనాల తయారీలో చాలా కీలకమైన వీటిని, చమురు, సహజ వాయువును వెలికితీస్తే పర్యావరణానికి ముప్పేనన్న స్పృహతో అక్కడి ప్రభుత్వం 2019 నుంచి నిషేధం విధించింది. వీటన్నింటినీ చేజిక్కించుకునేందుకే రష్యా, చైనా బూచి చూపడం సహా ట్రంప్ వాచాలత. అభ్యంతరం చెప్పిన యూరోపియన్ యూని యన్ దేశాలపై వచ్చే నెల 1 నుంచి 10 శాతం సుంకాలు విధిస్తాననడం కయ్యానికి కాలుదువ్వడమే!

గాజా పునర్నిర్మాణం కోసమంటూ తాను శాశ్వత అధ్యక్షుడిగా శాంతి మండలి ఏర్పాటు చేస్తాననడం, దానికి మనదేశం సహా 60 దేశాలను ఆహ్వానించడం మరో ప్రమాదక ర పోకడ. తలా తోకా లేకుండా ఐక్యరాజ్య సమితిని నిర్వీర్యం చేసేలా ఉన్న ఈ ఎత్తుగడ గాజా వాసులకు సహాయం అందకుండా చేసి తరిమేయడానికి, జాతి నిర్మూలనకు, ఆ ఆనవాళ్లు చెరిపేయడానికే.

మెరికా ఆంక్షలతో ఇరాన్, రష్యా, వెనిజులా తదితర దేశాలు వివిధ కరెన్సీల్లో చమురు అమ్మకాలు జరపడంతో డాలర్ ఆధిపత్యానికి కొంతమేర గండిపడటం, వాణిజ్యలోటు అంతకంతకూ పెరిగిపోతుండటం, ప్రపంచంలోనే అతిపెద్ద రుణగ్రస్థ దేశంగా కొనసాగుతుండటం లాంటి సవాళ్లను అధిగమించడానికి అగ్రరాజ్యం విధ్వంసకర ఎత్తుగడలకు పూనుకోవడం గర్హనీయం. ఒకప్పుడు తన వలసలుగా ఉన్న దేశాల్లోని సంపదనంతా తరలించుకుపోయిన బ్రిటీష్ సామ్రాజ్యవాదుల తరహాలోనే× ప్రపంచంపై పెత్తనం చేయాలనుకోవడం ఆందోళనకరం. దిగుమతులపై అధిక సుంకాలు విధించడం, చమురు, సహజవాయువు లాంటి ఇంధనాలను నిల్వవుంచుకునే పద్ధతికి భిన్నంగా అమ్మకాలు జరపడం, విలువైన వనరులున్న దేశాలను నయా వలసలుగా చేసుకుని, వాటిని కొల్లగొట్టడం, ఇజ్రాయిల్ ద్వారా మధ్యప్రాచ్యమంతటా మంటలు రాజేయడం, వెనిజులాకు తానే అధ్యక్షుడినని ట్రంప్ ప్రకటించుకోవడం, ఇరాన్‌లో పాలకులను మార్చేస్తాననడం, క్యూబాకు అమెరికా విదేశాంగ మంత్రి అధ్యక్షుడు అవుతాడనడం ఇవన్నీ అందులో భాగమే. ఒకప్పుడు సామ్రాజ్యవాద దురహంకారాన్ని నిలువరించిన సోవియట్ యూనియన్‌లా బలమైన సోషలిస్టు శిబిరం లేకపోవడంతో అమెరికా ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. లాటిన్ అమెరికాకో, ఇయుకో పరిమితమవుతుందనుకుని చేష్టలుడిగి కూర్చుంటే× మూడో ప్రపంచ దేశాలకూ యుద్ధ మేఘాలు విస్తరించే ప్రమాదం పొంచివుంది. ఎన్ని మాటలన్నా, సరైన పత్రాల్లేవంటూ ప్రవాస భారతీయులను సంకెళు వేసి, గొలుసులతో బంధించి అవమానకరంగా యుద్ధ విమానాల్లో తరలించినా, ఎడాపెడా సుంకాలు విధించి దేశానికి తీరని నష్టం కలిగిస్తున్నా, నిత్యం బెదిరింపులకు పాల్పడుతున్నా మన పాలకులు నోరుమెదపక పోవడం సిగ్గుచేటు. అమెరికా దురహంకార, ఆధిపత్య చర్యలను ఇకనైనా భారత్ ప్రతిఘటించాలి. అంతర్జాతీయ న్యాయ సూత్రాలను, దేశాల స్వాతం(త్యాన్ని కాలరాస్తూ× ప్రపంచాన్ని పెనువిపత్తు దిశగా తీసుకె ళ్తున్న సామ్రాజ్యవాద దురహంకారాన్ని తుదముట్టించడం అత్యావశ్యకం. అందుకు భిన్నంగా వ్యవహరించిన దేశాలను, పాలకులను భవిష్యత్ తరాలు, చరిత్ర క్షమించవు.

# మురికి కాలువలు శుభ్రపరచాలి



**కమాన్ పూర్,తెలంగాణ దిశ :**మురికి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రపరచాలి అని పెంచికలపేట సర్పంచ్ పల్లె మాధవి నారాయణ అన్నారు. గురువారం కమాన్ పూర్ మండలంలోని పెంచల పేట రెండో వార్డులో మురికి కాలువలు పూర్తిగా చెత్తాచెదారంతో కూర్కుపోయాయి. దీంతో సర్పంచ్ పల్లె మాధవి నారాయణ ఆదేశాలతో గ్రామ కార్యదర్శి సూది రెడ్డి ప్రవళిక ఆధ్వర్యంలో కాలువలో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని పూర్తిగా తొలగించారు. అలాగే గ్రామంలో చెత్తాచెదారం లేకుండా చూస్తామని ఎప్పటికప్పుడు గ్రామపంచాయతీ సిబ్బంది తొలగించాలని మురికి నీరు నిల్వ లేకుండా చూడాలని సర్పంచ్ సూచించారు. ఆయా పనులను ఉపసర్పంచ్ చొప్పరి శేఖర్ పరిశీలించారు.

# వైసీపీలో అంతర్గతంగా అసంతృప్తి

**విజయనగరం,తెలంగాణ దిశ :**ప్రస్తుతం వైసీపీలో అంతర్గతంగా అసంతృప్తి పెరుగుతోందన్న మాట ఆ పార్టీ నాయకుల నుంచే వినిపిస్తోంది. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంపై పైచేయి సాధించేందుకు ఎంచుకున్న వ్యూహాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వడం లేదని వారు భావిస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం వైసీపీ చేస్తోందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది. ఇవన్నీ గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలోనే ప్రారంభమయ్యాయని, ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాటికి క్రెడిట్ తీసుకుంటున్నారని ప్రచారం చేస్తున్నారు.అయితే ఈ ప్రచారం ప్రజల్లో పెద్దగా ప్రభావం చూపడం లేదని పార్టీ నేతలే అంగీకరిస్తున్నారు. ఏ పని చేసినా అది జరిగినప్పుడే చెప్పుకోవాలి అన్న అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉందని అంటున్నారు. నిజంగా ఆ పనులు అప్పట్లో జరిగి ఉంటే, అప్పుడే వాటిని ప్రజల ముందు బలంగా ఉంచాల్సిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు ఆలస్యంగా చెప్పుకుంటున్న మాటలకు ప్రజలు పెద్దగా స్పందించడం లేదని వైసీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇంకొక వైపు సోషల్ మీడియా ప్రచారం కూడా పార్టీకి కలిసి రావడం లేదన్న చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి, మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాల్గొంటున్న కార్యక్రమాల్లో చేసిన వ్యాఖ్యలను కోట్ చేస్తూ, వాటిని వక్రీకరించి పోస్టులు పెట్టడం ద్వారా లాభం ఉంటుందని భావించారు. కానీ ఈ ప్రయత్నం కూడా ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయిందని నేతలే చెబుతున్నారు. ఇలాంటి అనుచిత ప్రచారం వల్ల ప్రభుత్వానికి నష్టం కంటే, తమకే నష్టం జరుగుతోందన్న భావన పార్టీ లోపల పెరుగుతోంది.మొత్తంగా చూస్తే వైసీపీ ఎంచుకున్న రాజకీయ ఎత్తులు పనిచేయడం లేదన్న భావన బలపడుతోంది. ఇదే సమయంలో పార్టీ నుంచి బయటకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న నాయకుల సంఖ్య కూడా పెరుగుతోందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ముందుగా వీరిని నిలువరించాల్సిన అవసరం ఉందని కొందరు సూచిస్తున్నా, అధిష్టానం నుంచి స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని అంటున్నారు. పోయేవారు పోతే పోనీయండి అన్న ధోరణి కొనసాగుతుండటంతో మిగిలిన నాయకుల్లోనూ నిరాశ పెరుగుతోంది.ఈ పరిస్థితుల్లో చిన్న అవకాశం దొరికినా పార్టీ వీడేందుకు సిద్ధంగా ఉన్నామని కొందరు బహిరంగంగానే




చెబుతున్నారని సమాచారం. ఒకప్పుడు బలమైన కేడర్, స్పష్టమైన వ్యూహాలతో ముందుకు సాగిన పార్టీ ఇప్పుడు అయోమయంలో ఉందన్న అభిప్రాయం రాజకీయ విశ్లేషకుల్లో వ్యక్తమవుతోంది. ప్రజల నమ్మకాన్ని తిరిగి పొందాలంటే కేవలం ప్రచారంతో కాకుండా, స్పష్టమైన దిశానిర్దేశం, నాయకత్వ నిర్ణయాలు అవసరమన్న చర్చ వైసీపీ వర్గాల్లోనే సాగుతోంది.ఇదిలా ఉండగా, గత ఎన్నికల సమయంలోనే తాను మళ్లీ పోటీ చేయబోనని నాని ప్రకటించారు. తన సోదరుడి కుమారుడిని రాజకీయ వారసుడిగా సూచించినా, పార్టీ పెద్దల ఆలోచన వేరేలా ఉన్నట్లు తెలుస్తోంది. నానిని నియోజకవర్గ రాజకీ యాల నుంచితప్పించి, పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించాలన్న అభిప్రాయంఉన్నట్లు వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. 2029 ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వస్తే, ఆయనకు రాజ్యసభ లేదా ఎమ్మెల్సీ వంటి పదవులు దక్కే అవకాశముందన్న ప్రచారం కొనసాగుతోంది. ఇందులో ఎంత నిజం ఉందో రానున్న రోజుల్లో తేలాల్సి ఉంది.

# లోక్‌పాల్ తోనే రాజకీయ అవినీతికి అడ్డుకట్ట !

త్వం శుంఠ అంటే.. త్వం శుంఠ అన్నట్లుగా తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలు నడుస్తున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు అవినీతికి తెగించడం..వేలకోట్లు సంపాదించడం..అధికారం పోయాక, అధికారంలో ఉన్న పార్టీల అవినీతి గురించి ప్రశ్నించడం చూస్తున్నాం. అధికారంలో ఉన్న వారు, అధికారంలో ఉండి విపక్షంలోకి వచ్చిన వారు చేసిన అవినీతి వల్ల ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో కోలుకోలేని అప్పుల్లో కూరుకుని పోయాయి. ఇది వాస్తవం. విభజన వల్ల జరిగిన మేలు ఇదే. ఇందుకు నాలుగు పార్టీల నాయకులు బాధ్యులు. బిఆర్ఎస్‌గా మారిన టిఆర్ఎస్, కాంగ్రెస్, తెలుగుదేశం, వైకాపాలు ఈ అప్పులకు బాధ్యత వహించాలి. తెలుగు రాష్ట్రాల అప్పులను ఈ పార్టీల నుంచి వసూలు చేయాలి. అప్పుడే ఈ రెండు రాష్ట్రాలు అప్పుల ఊబినుండి బయటపడతాయి. ఇకపోతే నేతలకు సవాళ్లు విసురకోవడం అలవాటుగా మారింది. అధికారంలో ఉండగా తాము చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు, ఇప్పుడు అధికారంలో ఉన్న పార్టీలను నిందస్తున్నారు. ఇందులో ఎవ్వరేమీ తక్కువ తినలేదు. అందుకే రాజకీయ అవినీతిపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరగాలి. సాధారణ పోలీసులతో ఇది సాధ్యం కాదు. ప్రత్యేక వ్యవస్థను రూపొందించాలి. అన్నా హజారే కోరినట్లుగా లోక్‌పాల్ వ్యవస్థను తీసుకుని రావాలి. అప్పుడే స్వతంత్ర దర్యాప్తు కొనసాగుతుంది. అవినీతిపై నిగ్గు తేలుస్తారు. రాజీకయ పార్టీలు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలకు చట్టాలు తేవాలి. ప్రస్తుత సమాజంలో బాగా వేళ్లూనుకున్న అవినీతి ఎక్కడయినా ఉందంటే అది రాజకీయ పార్టీల్లోనే. పటిష్ట లోక్‌పాల్ వ్యవస్థ ద్వారానే అవినీతి నేతలను శిక్షించగలం. అందుకు ప్రజా ఉద్యమాలు రావాలి. ఆప్ ఉద్యమంలా కాకుండా ప్రజలు, మేధావులు కలసి ఉద్యమించాలి. ఇక తెలుగు రాష్ట్రాల విషయాలకు వస్తే జగన్, వైకాపా అవినీతిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కెసిఆర్, ఆయన కుటుంబం, బిఆర్ఎస్ నేతల అవినీతిపైనా చర్యలు ముందుకు సాగడం లేదు. తాజాగా కాంగ్రెస్ అవినీతి బట్టబయలు అయ్యింది. ఈ క్రమంలో వీరి అవినీతిపై చర్యలు ఉంటాయనుకోవడం కూడా అత్యాశే అవుతుంది. తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సిట్ తన దర్యాప్తును ముమ్మరం చేసింది. రెండేళుగా సాలీడు దారంలా సాగుతోంది. ఇందులో భాగంగా తాజాగా మాజీ మంత్రి హరీష్‌రావును సిట్ అధికారులు 7 గంటలపాటు విచారించారు. సిట్ విచారణపై ఇప్పుడు బిఆర్ఎస్ నేతలు ఎదురుదాడికి దిగుతున్నారు. రేవంత్ రెడ్డి నీకు దమ్ముంటే నాకు నోటీసులు ఇవ్వడం కాదని, రాజకీయంగా కొట్లాడుదాం అని హరీష్ రావు సవాల్ విసిరారు. కాళేశ్వరం సహా అనేక అవినీతి కేసులు ఉన్నా ఆ పార్టీ నేతలు బరితెగించి మాట్లాడుతున్నారు. వారి అవినీతిని ప్రశ్నిస్తున్న అధికార కాంగ్రెస్ నేతలు తామూ అవినీతి బురదలో కూరుకు పోయారు. ఒక్కో మంత్రి మీద ఒక్కో అవినీతి బయటపడుతోంది. దీనినిబట్టి అవినీతి రాజకీయ పార్టీల హక్కుగా మారిందని అర్థం చేసుకోవాలి. ఫోన్ ట్యాపింగ్, ఈ కార్ రేసు, కాళేశ్వరం వంటివననీ పిచ్చకుంట్ల, లొట్టపీసు కేసులని బిఆర్ఎస్ వాదిస్తోంది. కాగ్రెస్ పై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర లోనే ఉన్నాయని హరీష్ రావు వ్యాఖ్యానించడం, ఆయన తప్పించుకునే రాజకీయ తెలివిని ప్రదర్శించారని గుర్తించాలి. ఇకపోతే సింగరేణి సంస్థ నిబంధనలు మార్చి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన బావమరిదికి రూ.1,600 కోట్ల టెండర్లు కట్టబెట్టారని బిఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. బొగ్గు కుంభకోణంపై నిగ్గు తేల్చడం కోసం సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కార్ అనేక కుంభకోణాలకు పాల్పడిందని, రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని మండిపడ్డారు. మంత్రుల వద్ద వాటాల పంచాయితీ నడుస్తున్నదని దుయ్యబట్టారు. గతంలో సింగరేణిపై ఏ ప్రభుత్వం కూడా అజమాయిషి చేయలేదని, కానీ, రేవంత్ సర్కార్ మాత్రం అజమాయిషీ చేస్తూ, తద్వారా సంస్థను నిర్వీర్యం చేస్తున్నదని దుయ్యబట్టారు. మొత్తానికి వజ్రాన్ని వజ్రంతోనే కోయాలని అంటారు. అవినీతి ఆరోపణలను అవినీతి ఆరోపణలతో తిప్పికొట్టడం ఇప్పుడు రాజకీయ పార్టీలకు అలవాటుగా మారింది. సింగరేణి సంస్థకు నష్టం చేకూరేలా చేస్తున్నారన్న ఆరోపణలు వచ్చినప్పుడు దానిని సరిదిద్దుకొని సంస్థ ఖజానాకు గండి పడకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీది. సింగరేణిపై కాంగరెస్, బిఆర్ఎస్ పార్టీలు గద్దల్లా పడి దోచుకుంటున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఆరోపించారు. బొగ్గు మంత్రిగా ఉన్నా కిషన్ రెడ్డి ఏం చేస్తున్నట్లు అన్నది చెప్పాలి. కేంద్రం నిజాయితీగా ఎందుకు వ్యవహరించడం లేదు. అవినీతిపరులను ఎందుకు బోను ఎక్కించడం లేదు. ఇవన్నీ శేష ప్రశ్నలు. సాధారణ టెండర్లలోనూ బిడ్ వేసే ముందు కాంట్రాక్టర్లు పనిచేసే ప్రాంతాన్ని సందర్శించి టెండర్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న వివరాలతో బేరీజు వేసుకుంటారు. ప్రీబిడ్ సమావేశంలో తమ అనుభవాలు, సమస్యలు, అభ్యంతరాలను అధికారుల ముందు ఉంచి పరిష్కారాలు, వెసులుబాట్లను ప్రతిపాదిస్తారు. కానీ సింగరేణి టెండర్లు మైనింగ్‌కు సంబంధించినవైనందున భౌగోళిక పరిస్థితులతో ముడిపడి ఉంటుంది. అవినీతి వ్యవహారాలు పునరావృతం కాకుండా ఉండాలంటే కచ్చితంగా టెండర్ నోటిఫికేషన్‌లోనే కొత్త షరతులు పెట్టాల్సి ఉంటుంది. ఒడిశా అంగూల్ జిల్లాలోని నైని కోల్‌బ్లాక్‌ను 2015లో దక్కించుకున్న సింగరేణి సంస్థ, 2200 ఎకరాల విస్తీర్ణంలోని ఆ బ్లాకులో 200 ఎకరాల విస్తీర్ణానికి బీఆర్ఎస్ హయాంలోనే టెండర్లు పూర్తి చేసి, పనులు అప్పగించింది. కాంపిటీటివ్ బిడ్డింగ్ విధానంలో ఐదేండ్ల పాటు బొగ్గు వెలికితీతకు పిలిచిన ఆ టెండర్లలో ఐదు సంస్థలు పోటీపడ్డాయి. చివరికి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి చెందిన వీపీఆర్ సంస్థ టెండర్ దక్కించుకున్నది. రోజుకు 30వేల క్యూబిక్ మీటర్ల ఓబీని ఈ సంస్థ వెలికి తీస్తున్నది. అతను కూడా రాజకీయ పార్టీకి చెందిన వాడే ఆవడంతో అవినీతికి ఆస్కారం ఏర్పడింది. టెండర్ విధానాన్ని పారదర్శకంగా నిర్వహించాలనుకుంటే సైట్‌ను పరిశీలించిన ప్రతి కంపెనీకి ఇప్పటికే సర్టిఫికెట్లు జారీ చేయాల్సి ఉన్నది. ఆ మేరకు సుశీ కంపెనీతో పాటు పలు కంపెనీలు కూడా పదేపదే అధికారులకు ఫోన్ చేసి తమకు సర్టిఫికెట్ జారీ చేయాలని కోరుతున్నా అధికారులు జారీ చేయలేదంటే.. ప్రభుత్వ పెద్దల ఆదేశాల కోసం వేచి చూస్తున్నారనేది బహిరంగ రహస్యం. అయితే నైనీ టెండర్లకు సంబంధించి అసలు ఈ సర్టిఫికెట్ ఎవరు జారీ చేయాలనే దానిపైనా సింగరేణిలో స్పష్టత లేదనే ప్రచారం జరుగుతుందంటే ప్రక్రియ ఎంత గుడ్డిగా కొనసాగుతున్నదో అర్థం చేసుకోవచ్చు. ఈ వ్యవహారంలో విచారణ జరగాలి. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో వస్తున్న ఆరోపణలపై విచారణ జరగాలి. బిఆర్ఎస్ పదేళ్ల పాపాలపైనా విచారణ సాగాలి. చంద్రబాబు, జగన్ పాపాలపైనా విచారణ జరగాలి. అందుకు లోక్‌పాల్ ఒక్కటే శరణ్యం.


# కామారెడ్డి జిల్లాలో విషాదం..

**కోతుల గుంపుపై విష ప్రయోగం, పలు వానరాలు మృతి**



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** కామారెడ్డిజిల్లా విషాదం చోటు చేసుకుంది. కోతులపై విషయ ప్రయోగం చేయడంతో పది కోతులు మృతి చెందాయి. మరికొన్ని కోతులు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుండా పశువైద్య సిబ్బంది కాపాడారు. ఈ విషాదాకర సంఘటన బిక్కనూరు మండలం అంతంపల్లి సమీపంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గుర్తుతెలియని వ్యక్తులు కోతులను అంతంపల్లి సమీపంలోని ఓ హొటల్ వద్ద వదిలిపోయారు. కోతులు మృతి చెంది ఉండటాన్ని గమనించిన స్థానిక సర్పంచ్ ఏనుగు మంజుల వెంటనే పోలీసులతో పాటు అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించగా ఎవరో వాహనంలో సుమారు 150 నుంచి 200 వరకు కోతులను తీసుకొచ్చి వదిలిపెట్టనట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ఇటీవల కాలంలో దుండగులు మూగజీవాలకు విషం పెట్టి చంపి వేస్తున్న సంఘటనలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఇది గ్రామస్తులకు, పశువులకు కూడా ప్రమాదకరమని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వాలు స్పందించి నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ఎట్టకేలకు లుక్ మార్చుకున్న అయ్యప్ప శర్మ




టాలీవుడ్ విలక్షణ నటుడు అయ్యప్ప శర్మ (సాయికుమార్ సోదరుడు) తన సరికొత్త మేకోవర్‌తో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. సుమారు 14 సంవత్సరాలుగా పొడవాటి జుట్టు, గుబురు గడ్డంతో ఒకే రకమైన లుక్‌లో కనిపించిన ఆయన, తాజాగా క్లీన్ షేవ్‌తో దర్శనమిచ్చారు. కన్నడలో తెరకెక్కుతున్న 'పబ్బార్' అనే సినిమా కోసం ఆయన తన సిగ్నేచర్ స్టైల్‌ను పూర్తిగా మార్చుకున్నారు. ఈ చిత్రంలో అయ్యప్ప శర్మ ఒక పవర్‌ఫుల్ పోలీస్ అధికారి (ఎస్పీ) పాత్రను పోషిస్తున్నారు. గత దశాబ్ద కాలంగా విలన్ పాత్రలకు అయ్యప్ప శర్మ పెట్టింది పేరు. ముఖ్యంగా ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్న సినిమాల్లో ఆయన నటనకు ప్రత్యేకమైన అభిమానులు ఉన్నారు. తన గంభీరమైన కంఠంతో, కళ్లలోని తీక్షణతతో ఎన్నో పాత్రలకు ప్రాణం పోశారు. 'కేజీఎఫ్' లాంటి పాన్-ఇండియా చిత్రంలోనూ తనదైన ముద్ర వేశారు. అలాంటి నటుడు ఒక పాత్ర కోసం తన ఇమేజ్‌ను పక్కనపెట్టి, ఇలా కొత్తగా కనిపించడం ఇండస్ట్రీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం అయ్యప్ప శర్మ కొత్త లుక్‌కు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఖాకీ యూనిఫామ్‌లో ఆయన ఆహార్యం ఆకట్టుకుంటోంది. గడ్డం, జుట్టు లేకపోయినా ఆయన ముఖంలో గంభీరత్వం ఏమాత్రం తగ్గలేదని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. నటుడిగానే కాకుండా తన సోదరులు సాయికుమార్, రవిశంకర్ మాదిరిగానే డబ్బింగ్ ఆర్టిస్టుగానూ అయ్యప్ప శర్మ సుపరిచితులే. ఈ 'పబ్బార్' చిత్రం ఆయన కెరీర్‌లో ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.




## రాజకీయ రొచ్చులోకి హీరోయిన్లు

# తెలంగాణలో రకుల్.. తమిళంలో త్రిష

అమ్మ, ఆలి, చెల్లి... ఆడవాళ్ళ ప్రస్తావన లేకుండా తిట్టు చూద్దాం అని ఓ సినిమాలో విలన్‌కు సవాల్ విసురుతాడు హీరో. ఇప్పుడు రాజకీయ నాయకులకు సైతం ఈ విధమైన సవాల్ విసరాలేమో!? హీరోయిన్లను అడ్డు పెట్టుకుని విమర్శలు వద్దని, కేవలం రాజకీయాలకు మాత్రమే పరిమితం కావాలని! ఎందుకంటే... తెలంగాణలో రకుల్ ప్రీత్ సింగ్, తమిళనాడులో త్రిషను కొందరు నేతలు తమ స్వార్థం కోసం రాజకీయాల్లోకి లాగుతూ ప్రత్యర్థి పార్టీ నాయకులను టార్గెట్ చేశారు. త్రిషకు, రాజకీయాలకు సంబంధం లేదు. ప్రత్యేక్షంగా ఎవరికీ, ఏ రాజకీయ పార్టీకి త్రిష మద్దతు ఇచ్చిన సందర్భాలు లేవు. కానీ, ఇప్పుడు తమిళ రాజకీయాలు ఆమె చుట్టూ తిరుగుతున్నాయి. అందుకు కారణం కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ పార్టీ స్థాపించి రాజకీయాల్లోకి రావడం. తమిళ రాజకీయాల్లో తాను ఒంటరిగా పోటీ చేస్తానని దళపతి విజయ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దాంతో మిగతా రాజకీయ పార్టీలు ఆయనపై కత్తి కట్టాయి. అది సహజం. విజయ్ 'జన నయగన్' విడుదలకు అడ్డంకులు ఏర్పడ్డాయి. అందులో రాజకీయ కోణం చూస్తున్నారు కొందరు. నిజానిజాలు పక్కన పెడితే... విజయ్ వరకు సంబంధించిన వ్యవహారం అది. విజయ్ మీద విమర్శలు గుప్పించే క్రమంలో తమిళనాడు భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు నయనార్ నాగేంద్రన్ ఓ అడుగు ముందుకేసి... త్రిష ఇంటి నుంచి విజయ్ బయటకు రావాలని కామెంట్ చేశారు.

ఆయన వ్యాఖ్యలపై విజయ్ - త్రిష అభిమానులు, మహిళా సంఘాలు భగ్గుమన్నాయ్. తెలంగాణలోనూ ఈ విధమైన నీచ రాజకీయాలు ఇటీవల జరిగాయి. భారతీయ రాష్ట్ర సమితి నాయకుడు, కేసీఆర్ తనయుడు కల్వకుంట్ల తారక రామారావు (కేఆర్ఆర్)కు, కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్‌కు ముడి పెడుతూ విమర్శలు చేశారు, ఇంకా చేస్తున్నారు ప్రత్యర్థులు. ఆ మధ్య సమంత వ్యక్తిత్వాన్ని తక్కువ చేసేలా విమర్శలు చేసి తర్వాత క్షమాపణలు చెప్పారు కొండా సురేఖ. తెలంగాణ రాజకీయ విమర్శల్లో అప్పుడప్పుడూ సురేఖా వాణి పేరూ వినిపిస్తూ ఉంటుంది. ఆ మధ్య తమిళనాడు రాజకీయాల్లో ప్రదీప్ రంగనాథన్ 'డ్రాగన్', విశ్వక్ సేన్ 'ఫంకీ' హీరోయిన్ కయాదు లోహార్



పేరు హైలైట్ అయ్యింది. ఎందుకు? రాజకీయాల్లో హీరోయిన్లను టార్గెట్ చేయడం ఎందుకు? ఇప్పుడు చిత్ర పరిశ్రమ నుంచి కాదు... సామాన్యుల నుంచి వ్యక్తం అవుతున్న ప్రశ్న. విలువలతో కూడిన రాజకీయాలను కొందరు ఎప్పుడో వదిలేశారు. కనీసం ఆడవాళ్లను తీసుకు రాకుండా రాజకీయాలు చేయలేరా? సినిమాల్లో విజయ్ - త్రిషది హిట్ పెయిర్. కొన్ని సినిమాలు చేసిన హీరో హీరోయిన్ల మధ్య పరిచయం ఉంటుంది. సినిమాల్లో ఉన్నట్టు బయట ఉంటారని విమర్శలు చేయడం ఎంత వరకు సబబు?

అసలు రాజకీయాలతో సంబంధాలు లేని రకుల్ పేరు లాగడం ఎందుకు? తమిళనాడులో త్రిష... తెలంగాణలో రకుల్... రాజకీయాలకు సాఫ్ట్ టార్గెట్ కింద మారారు. సినిమాల్లో నటించడం, తమ పని ఏదో తాము చూసుకోవడం తప్ప ఈ తరహా రాజకీయ విమర్శలకు బదులు ఇవ్వరు. ఒకవేళ ఇస్తే మళ్ళీ మళ్ళీ వచ్చే రాజకీయ విమర్శలు అన్నిటికీ బదులు ఇవ్వవలసి ఉంటుంది. అందుకని, త్రిష - రకుల్ మౌనం వహిస్తున్నారు. విమర్శలను వాదిస్తున్నారు. దాంతో కొందరు రాజకీయ నాయకులు - వాళ్ళ అనుచరులకు చెందిన సోషల్ మీడియా ఖాతాల్లో హీరోయిన్లపై వ్యక్తిత్వ దాడి కొనసాగిస్తోంది. దీనికి చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది.

# స్టార్‌గా ఎదగడం మామూలు విషయం కాదు



సినిమా ఇండస్ట్రీలో బ్యాక్‌గ్రౌండ్ లేకుండా వచ్చి స్టార్‌గా ఎదగడం అంటే చిన్న విషయం కాదు. అందులోను ముఖ్యంగా హీరోయిన్‌లకు.. ఎంత అందంగా ఉన్నప్పటికి స్టార్ డమ్ సంపాదించుకోవాలి అంటే తిప్పలు పడాల్సిందే. కొంత మందికి అదృష్టం బాగుండి అవకాశాలు వస్తాయి అందులో మృణాల్ ఠాకూర్ ఒకరు. తన అందం, అభినయంతో సౌత్ నార్త్ ప్రేక్షకులను మాయ చేస్తున్న ఈ ముద్దుగుమ్మ, ప్రస్తుతం ఆమె నటించిన లేటెస్ట్ మూవీ 'దో దీవానే షెహర్ మే' విడుదల సిద్ధంగా ఉంది. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా మృణాల్ తన కెరీర్ తొలినాళ్లలో పడ్డ కష్టాలను పంచుకుంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంచి పాత్రల కోసం దర్శకుల వెంట పడటంలో ఏమాత్రం తప్పు లేదని మృణాల్ స్పష్టం చేశారు.. 'మనం ఒక పాత్ర కోసం ఎంత ఆకలితో ఉన్నామో తెలిస్తేనే దర్శకుల ఆలోచనా విధానం మారుతుంది' అని ఆమె అభిప్రాయపడ్డారు. తన తాజా చిత్రం 'దో దీవానే షెహర్ మే' అవకాశం కూడా అలానే వచ్చిందని ఆమె వెల్లడించారు. దర్శకుడు రవి ఉద్యావర్ తెరకెక్కించిన 'మామ్' సినిమా చూసి ఫిదా అయిపోయిన మృణాల్, నేరుగా ఆయన్ని కలిసి.. 'సర్, మనం సినిమా ఎప్పుడు చేస్తున్నాం?' అని అడిగేశారట. ఆమెలోని ఆ ధైర్యమే నేడు ఈ భారీ ప్రాజెక్టులో అవకాశం తెచ్చిపెట్టింది. గతాన్ని గుర్తుచేసుకుంటూ.. 'మొదట్లో నాకు పని ఎలా అడగాలో కూడా తెలియదు. 'ధురంధర్' డైరెక్టర్ ఆదిత్య ధర్ గారినే నేను మొదటిసారి అవకాశం అడిగాను. ఒక అవుట్‌సైడర్‌గా నా ముఖం వాళ్లకు కనిపించేలా చేసుకోవడానికి 'సర్, నేను ఇక్కడే ఉన్నాను.. నన్ను ఒకసారి కాస్ట్ చేయండి' అని బతిమిలాడేదాన్ని' అంటూ మృణాల్ ఎమోషనల్ అయ్యారు. సిద్ధాంత్ చతుర్వేదితో కలిసి ఆమె నటించిన ఈ రొమాంటిక్ డ్రామా ఫిబ్రవరి 20న థియేటర్లలోకి రానుంది. అరేంజ్డ్ మ్యారేజ్ నేపథ్యంలో సాగే ఈ కథ ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని మృణాల్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# ప్రభాస్ కోసం 9వేల కోట్లు

ఈమధ్య కాలం లో ఓటీటీ సంస్థలు నిర్మాతలకు పెడుతున్న ఆంక్షల కారణంగా సినీ నిర్మాతలు ఎంత ఇబ్బంది పడుతున్నారో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. కరోనా లాక్ డౌన్ సమయం లో, కేవలం ఓటీటీ రైట్స్ నుండే నిర్మాతలకు పెట్టిన బడ్జెట్ తిరిగి వెనక్కి వచ్చేది. కానీ ఇప్పుడు మాత్రం ఆ పరిస్థితులు లేవు. ఓటీటీ సంస్థలకు కూడా వరుసగా నష్టాలు రావడం తో, సినిమా థియేటర్స్ లో విడుదలై సూపర్ హిట్ టాక్ తెచ్చుకొని, భారీ వసూళ్లు సాధిస్తేనే మీరు కోరినంత డబ్బులు ఇస్తాము. లేదంటే మాట్లాడుకున్న దాంట్లో 50 శాతం తగ్గించి ఇస్తామంటూ నిర్మాతలకు చెప్తున్నారు. నెట్ ఫ్లిక్స్ , అమెజాన్ ప్రైమ్(సంస్థల రేంజ్ నుండి, చిన్న చిన్న ఓటీటీ సంస్థల వరకు ఇప్పుడు అందరూ ఇదే పద్దతిని అనుసరిస్తున్నారు. ముఖ్యంగా నెట్ ఫ్లిక్స్ సంస్థ గురించి మాట్లాడుకోవాలి. ఈ సంస్థ ఒక సినిమాని కొనుగోలు చెయ్యాలంటే చాలా అంశాలను పరిగణలోకి తీసుకుంటుంది. ఎంత పెద్ద సూపర్ స్టార్ సినిమాకు అయినా, పైన చెప్పిన ఆంక్షలు తప్పవు, కానీ ఒక్క ప్రభాస్కి మాత్రం ఇలాంటి ఆంక్షలను మినహాయించింది నెట్ ఫ్లిక్స్ సంస్థ. ఇక నుండి రాబోయే ప్రతీ ప్రభాస్ సినిమాని నెట్ ఫ్లిక్స్ సంస్థ కొనుగోలు చెయ్యాలని ఫిక్స్ అయ్యిందట. అందుకోసం 9 వేల కోట్ల బడ్జెట్ టార్గెట్ ని పెట్టుకున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే 'స్పిరిట్' చిత్రాన్ని కొనుగోలు చేసింది. నెట్ ఫ్లిక్స్ సంస్థ. ఈ చిత్రం తర్వాత రాబోయే 'ఫౌజీ', 'కల్కి 2', 'సలార్ 2' చిత్రాలకు విడుదల తేదీలను ప్రకటించగానే కొనుగోలు చేయడానికి సిద్ధం గా ఉందట. వీటితో పాటు ప్రభాస్, ప్రశాంత్ వర్మ కాంబినేషన్ లో రాబోతున్న చిత్రం, ఇక ఆ తర్వాత ఏ సినిమా విడుదలైన నెట్ ఫ్లిక్స్ లోనే ప్రభాస్ సినిమాలు ఉంటాయని టాక్.

ప్రభాస్ కోసం వాళ్ళు కేటాయించిన 9000 కోట్ల బడ్జెట్ పూర్తి అయ్యే వరకు ఆయన సినిమాలు కొంటునే ఉంటారట. ఎందుకు నెట్ ఫ్లిక్స్ సంస్థ ప్రభాస్ సినిమాలకు ఇంత మక్కువ చూపిస్తుంది అంటే, ఆయన సినిమాలకు వచ్చిన వ్యూస్ అలాంటివి మరీ. సలార్ చిత్రానికి హిందీ వెర్షన్ లేకుండా ఏకంగా 18 మిలియన్ వ్యూస్ వచ్చాయి. సాధారణంగా నెట్ ఫ్లిక్స్ లోని మన ఇండియన్ భాషల్లో హిందీ బాషలోనే సినిమాలను చూసేందుకు ఎక్కువగా మక్కువ చూపిస్తుంటారు ఆడియన్స్. ఉదాహరణకు 'కల్కి' చిత్రాన్ని తీసుకుందాం, ఈ సినిమా హిందీ వెర్షన్ నెట్ ఫ్లిక్స్ లో విడుదలైంది. కేవలం ఈ ఒక్క వెర్షన్ కి 15 మిలియన్ వ్యూస్ వచ్చాయి.

# నిర్మాతగా నిత్యా మీనన్ కొత్త ప్రయాణం



ప్రముఖ నటి, జాతీయ అవార్డు గ్రహీత నిత్యా మీనన్ తన సినీ ప్రయాణంలో మరో కీలక మైలురాయిని చేరుకున్నారు. నటిగా ఇప్పటికే విభిన్న పాత్రలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఇప్పుడు నిర్మాతగా కొత్త అవతారం ఎత్తుతున్నారు. 'కేయూరి ప్రొడక్షన్స్' పేరుతో తన సొంత నిర్మాణ సంస్థను ప్రారంభిస్తున్నట్లు సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఓ ప్రత్యేక వీడియోలో తన నిర్మాణ సంస్థ లక్ష్యాలు, దృక్పథం గురించి నిత్యా మీనన్ స్పష్టత ఇచ్చారు. కేవలం వాణిజ్య పరమైన సినిమాలకే పరిమితం కాకుండా, బలమైన కథా నేపథ్యం ఉన్న చిత్రాలు, లోతైన భావోద్వేగాలను కలిగించే పాత్రలు, సమాజంపై ప్రభావం చూపగల కథాంశాలకే తన బ్యానర్ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. సినిమా అనేది కేవలం వినోదం మాత్రమే కాదని, అది ప్రేక్షకులతో ఒక భావోద్వేగ బంధాన్ని ఏర్పరచే శక్తి కలిగిన మాధ్యమమని ఆమె అభిప్రాయపడ్డారు. గత ఏడాది వరుసగా మూడు విభిన్న చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన నిత్యా, ఇప్పుడు నిర్మాతగా కూడా తన ముద్ర వేయాలని సంకల్పించుకున్నారు. ప్రస్తుతం ఈ బ్యానర్ కింద ఎలాంటి ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించకపోయినా, ముందుగా తనకు ఉన్న నటనా కమిట్‌మెంట్‌లను పూర్తి చేయాలనే ఉద్దేశంతో ఉన్నారు. నటిగా కొనసాగుతూనే, అభిరుచి గల నిర్మాతగా కూడా బాధ్యతలు నిర్వహించనున్నారు. విభిన్న కథలను ఎంచుకోవడంలో, ప్రయోగాత్మక పాత్రలను పోషించడంలో నిత్యా మీనన్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఇదే ధోరణిని నిర్మాతగా కూడా కొనసాగిస్తారని, కొత్త తరహా కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తారని చిత్ర పరిశ్రమ వర్గాలు విశ్వసిస్తున్నాయి. ఆమె ప్రారంభించిన ఈ కొత్త నిర్మాణ సంస్థ భవిష్యత్తులో కంటెంట్ ఆధారిత, నాణ్యమైన సినిమాలకు వేదికగా మారే అవకాశముందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# వినోదమే ప్రధానంగా సత్యదేవ్ మూవీ!




హీరో సత్యదేవ్ కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టారు. సత్యదేవ్ నటిస్తున్న 15వ చిత్రమిది. ఈ చిత్రాన్ని బి. నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్నారు. కంప్లీట్ ఎంటర్ టైనింగ్ స్క్రిప్ట్ తో దర్శకుడు లక్ష్మీనారాయణ పుట్టంచెట్టి దీనిని రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో ఫరియా అబ్దుల్లా నాయికగా నటిస్తోంది. హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో ఈ మూవీ పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవానికి బ్లాక్ బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి ముఖ్య అతిథిగా హాజరై హీరో హీరోయిన్లపై క్లాప్ ఇచ్చారు. యంగ్ ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి కెమెరా స్విచ్చాన్ చేశారు. లక్ష్మీనారాయణ పుట్టంచెట్టి ఫస్ట్ షాట్‌కు డైరెక్షన్ చేశారు. ఈ సందర్భంగా వంశీ నందిపాటి మాట్లాడుతూ, 'నా స్నేహితుడు ప్రొడ్యూసర్ నరేంద్ర మరో మంచి చిత్రాన్ని చేస్తున్నారు. హీరో సత్యదేవ్ గారు ఒక ఔట్ అండ్ ఔట్ ఎంటర్ టైనర్‌లో నటిస్తున్నారు. ఈ సినిమా ఆయనకు బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ అవుతుంది. ఈ సినిమా సాధించబోయే విజయం గురించి తర్వాత మళ్లీ మాట్లాడుతాను. డైరెక్టర్ లక్ష్మీనారాయణకు కూడా ఈ సినిమా మంచి పేరు తీసుకొస్తుంది' అని అన్నారు. లక్ష్మీనారాయణ పుట్టంచెట్టి మాట్లాడుతూ, 'మా సినిమా జానర్ ఏమిటని అందరూ అడుగుతున్నారు. అందరి పెదాలపై నవ్వుల పూయించే చిత్రమిది. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ కు వెళ్తున్నాం. రామ్ మిరియాల మా సినిమాకు మంచి మ్యూజిక్ చేస్తున్నారు. ఫస్ట్ టైమ్ ఒక కంప్లీట్ మూవీకి ఆయన సంగీతాన్ని అందిస్తున్నారు. సత్యదేవ్ గారి కెరీర్‌లో ఇదొక పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను' అని చెప్పారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215